ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
శనివారం 25, ఏప్రిల్ 2026 16 పేజీలు





తన ధృవీకరణ చట్టబద్ధమేనంటున్న ఇరిగేషన్ ఇంజనీర్

మొత్తం 12 మీటర్లు పోతే ఇక యజమానికి మిగిలేదేంటి

నిబంధనలను సడలించే అధికారం మున్సిపాలిటీకి లేదు

వీరి అనుమతులపై కన్నేసి ఉంచిన పట్టణ మేధావులు

ఖమ్మం రోడ్‌లో భవన నిర్మాణాల కల్లోలం

కాకతీయ గేట్ వద్ద రోడ్డుమీదే కట్టేస్తున్నారు

మరి దీనికి పర్మిషన్ ఎవరిచ్చారు

## జాతీయ రహదారిపై 10 మీటర్ల..

# సెట్‌బ్యాక్ తప్పదు

## దీనికి అదనంగా డ్రెయిన్ బఫర్

**అశ్వారావుపేట/ప్రభాతవార్త**

ఖమ్మం వైపు జాతీయ రహదారి వెంబడి భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియ సంక్షోభంలో పడింది. ఈ విషయాన్ని ప్రభాతవార్త మొన్నటి సంచికలోనే వెల్లడించినప్పటికీ.. తదుపరి పర్యవసానాలు చాలా ఆసక్తికరంగా మారాయి. ఈ ఎన్‌హెచ్ మీద ఇప్పటికే కొన్నింటికి అశ్వారావుపేట మున్సిపాలిటీ రోడ్ అంచునుంచి 3 మీటర్ల సెట్‌బ్యాక్ ఖరారు చేసి నిర్మాణాలకు అనుమతులిచ్చేసింది. ఐతే మరికొందరు కూడా దరఖాస్తు పెట్టిన క్రమంలో కొత్త లిటిగేషన్ బయటపడింది. ఇరిగేషన్ ఎఇఇ శ్రీనివాసరావు జారీ చేసిన "ఎన్‌ఓసి" మొత్తం వ్యవస్థని దలకిందులు చేసే పారేసింది. ఈ ప్రదేశంలో ఈమధ్యనే నిర్మించిన "పక్కా డ్రెయిన్" ఉన్నందున దీని అంచునుంచి విధిగా 2 మీటర్ల బఫర్‌జోన్ వదలాల్సిందేనని ఆ ఎన్‌ఓసి లో చాలా స్పష్టంగా రాశారు. ఇదిగో ఇక్కడే పితలాటకం ప్రారంభమైంది.

2వ పేజీలో...

## అన్నదాతకు అండగా

# బీఆర్ఎస్ పోరాటం

ఖమ్మం కలెక్టరేట్ వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతాంగానికి మద్దతుగా ధర్నా

అధిక సంఖ్యలో పాల్గొన్న రైతులు, కార్యకర్తలు

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త



16వ పేజీలో...









# జాతీయ రహదారిపై 10 మీటర్ల సెట్‌బ్యాక్ తప్పదు

మొదటి పేజీ తరువాయి..



ఈ ఫైళ్లు వరంగల్ ఆర్‌డిడి కి వెళ్ళగా వాళ్ళేంచేశారంటే..."ఇరిగేషన్ సూచించిన 2 మీటర్లు, మున్సిపాలిటీ వారి 3 మీటర్లు వెరసి 5 మీటర్ల(16అడుగుల పైమాట)" స్థలాన్ని సెట్‌బ్యాక్ గా వదిలేయాల్సిందేనని ఆదేశించడంతో.,కళ్లు బైర్లు కమ్మాయి. కల్లోలం ఇంతటితో ఆగలేదు. ఇరిగేషన్ ఎఇఇ శ్రీనివాసరావు తన ఎన్‌ఓసి లో జిఓనెంబర్:168/2012 తేది:07.04.2012 బిల్డింగ్ రూల్స్‌ని పనిగట్టుకుని ప్రస్తావించడంతో మొత్తం జాతీయ రహదారిపైని నిర్మాణ ప్రక్రియకే నిప్పంటుకున్నట్లయింది. ఏవిధంగా అంటే..ఈ ఉత్తర్వులో జాతీయ రహదారులపై జరిపే ఏ భవన నిర్మాణానికైనా కనిష్ఠంగా రోడ్ అంచునుంచి లోపలికి 10మీటర్ల సెట్‌బ్యాక్ నిబంధన పాటించాల్సిందేనని కండిషన్ ఉన్నది(రూల్స్ పరిశీలిస్తే ఇది ఇంకా ఎక్కువే కనిపిస్తున్నది). ఇది మేము చెబుతున్నది కాదు. సాక్షాత్తూ కొన్ని నిర్మాణ అనుమతుల ఫైళ్ళను ఇదే రీజన్‌తో ఆర్‌డిడి అభ్యంతర పెట్టినట్లు బాధితులు కొందరు ప్రబాతవార్త వద్ద వాపోయారు. దీంతో 10 మీటర్లు జాతీయ రహదారి నిబంధన..దీనికితోడు ఇరిగేషన్ 2 మీటర్లు కలిపితే మొత్తం 37 అడుగులకు పైగా స్థలాన్ని వదలి నిర్మించాలి. అసలిక్కడ ఆ యజమానికి ఉండేదెంత. రూ.లక్షలు పోసి కొనుక్కున్న స్థలాలకు ఈవిధంగా గ్రహణం పట్టడంతో ఏం చేయాలో వారికి దిక్కుతోచడంలేదు. గగ్గోలు పెడుతున్నారు. దీన్నేమైనా మార్చి లోపాయికారి వ్యవహారం చేద్దామన్నా కుదిరేలా లేదు. ఎందుకంటే ఇరిగేషన్ ఎఇఇ శ్రీనివాసరావు మాత్రం తాను జారీచేసిన ఎన్‌ఓసి కే కట్టుబడతామని ఆయనే స్వయంగా ప్రభాతవార్తకు చెప్పారు. ఏ డ్రెయిన్ అయినా సరే దాని పక్కన బఫర్‌జోన్ ఉండి తీరుతుందని ఆయన బల్లగుద్ది చెప్పారు. కాబట్టి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడమో లేదా సవరించడమో జరగదని తేల్చి చెప్పడం., తీవ్రతకు అద్దం పడుతున్నది.

### ఇవీ నిబంధనలు

ఎఇఇ శ్రీనివాస్ తన ధృవీకరణలో పొందుపరచింది నిజమే. చట్టం సూచించిందే ఆయన చెప్పారు. అదేమంటే "మానవ నిర్మితమైనా., సహజసిద్ధంగా ఏర్పడినా.,పల్లె అయినా పట్టణమైనా.,చిన్నదైనా పెద్దదైనా సరే" 2 మీటర్ల బఫర్‌జోన్ అనేది దానికి ఉండి తీరుతుంది. "హాజీఅఫీజ్ వర్సెస్ స్టేటాఫ్ ఉత్తర్‌ప్రదేశ్" కేసులో 10.02.2023 తేదీన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్ (ఢిల్లీ) ఇచ్చిన తీర్పులో ఈ అంశాన్ని చాలా విశదీకరించిమరీ చెప్పారు. జస్టిస్ ఆదర్శకుమార్‌గోయల్ (ఛైర్‌పర్సన్), జస్టిస్ సుధీర్‌అగర్వాల్ (జ్యుడిషియల్ మెంబర్), జస్టిస్ అరుణ్‌కుమార్‌త్యాగి (జ్యుడిషియల్ మెంబర్), జస్టిస్ అఫ్రోజ్ అహ్మద్ (ఎక్స్‌పర్ట్‌మెంబర్), ల నేతృత్వంలో ఇచ్చిన ఈతీర్పు తర్వాతి కాలంలో సుప్రీం ఆమోదం పొందడం గమనార్హం. అందువల్ల అశ్వారావుపేట పట్టణంలో ఇటీవలే నిర్మింపబడిన పక్కా డ్రెయిన్ ని ఆనుకుని లోపలికి 2 మీటర్ల బఫర్‌జోన్ ఉండి తీరుతుందన్నమాట. కాబట్టి ఈ నిబంధనను మున్సిపాలిటీ తుచ తుప్పకుండా పాటించాల్సిందే. ఇకపోతే.,పైన చెప్పినట్లు జిఓ నెంబర్: 168/2012 ఉండనే ఉంది. దీని ప్రకారం జాతీయ రహదారి అంచునుంచి 10మీటర్ల సెట్‌బ్యాక్ వదలాల్సిందే. ఈ నేపథ్యంలో.. రేపటినుంచీ మున్సిపాలిటీ ఇవ్వబోయే అనుమతుల విషయంలో అంతా కన్నేసి ఉంచారు. ఈ నిబంధనలు పాటిస్తారా లేకా ఏదేని అడ్జస్ట్‌మెంట్లు ఉంటాయా అనేది గమనిస్తున్నారు. ఆపై కోర్టులూ రిట్ పిటిషన్లూ ఎలాగూ తప్పదు.

### ఓ స్పష్టత లేని మున్సిపాలిటీ

జాతీయ రహదారి మీద 3మీటర్ల సెట్‌బ్యాక్ వదిలేస్తే చాలు..మున్సిపాలిటీ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చేసి పచ్చజెండా ఊపేస్తుంది. ఇరిగేషన్ వారు దానికి మరో 2 మీటర్లను అదనంగా జోడిస్తారు. పులిమీద పుట్రలా "ఇది నేషనల్ హైవే" కాబట్టి కనిష్ఠంగా 10 మీటర్ల సెట్‌బ్యాక్ అనివార్యమని వరంగల్ టౌన్‌ప్లానింగ్ కార్యాలయం అడ్డుపడుతుంది. అసలు వీళ్ళలో వీళ్ళకే ఓ స్పష్టత లేకపోతే ఎలా అనే పెదవి విరుపులు పట్టణం నిండా పేరుకుంటున్నాయి. నిజానికి ఈ రూల్సేమీ అశ్వారావుపేట మున్సిపాలిటీ పుట్టాక పుట్టినవి కావు. పూర్వం నుంచీ ఉన్నవే. ఐనా ఆఫీసర్లలో ఈ తడబాట్లు ఎందుకుంటున్నాయో, ఎందుకు అధ్యయనం చేయకుండా కంగారు డుతున్నారో అర్థంకాదు. ఏదైనా క్షుణ్ణంగా తెలుసుకోవాలి కదా. రేపటినుంచీ ఈ 1172 సర్వే నెంబర్లో అనుమతుల అంశానికి సంబంధించి మున్సిపాలిటీ ఏవిధంగా ముందుకు సాగుతుందో ఓ కన్నేద్దాం.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

## జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో



జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనగణన స్వీయ నమోదు, వరి కోతలపై హార్వెస్టర్లకు అవగాహన కార్యక్రమం తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సోమవారం నుండి 5 రోజుల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, ఇందుకు తక్షణం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 69.66!! ఓటర్లు మ్యాపింగ్ జరిగిందని, గత రెండు నెలలుగా పురోగతి రాలేదని స్పష్టం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఓటర్ మ్యాపింగ్ కోసం ఎన్నికల సంఘం పోర్టల్ నుండి డేటాను డౌన్‌లోడ్ చేసి, మ్యాప్ కాని ఓటర్ల జాబితాను సంబంధిత బీఎల్‌ఓలకు అందజేసి మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం శనివారం మండల స్థాయిలో బి ఎల్ ఓలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు బూతు స్థాయి ఏజంట్లు నియమించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఈ నెల 26వ తేదీ నుండి స్వీయ జనగణన కార్యక్రమం ప్రారంభం కానున్నందున, జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా మండల స్థాయిలో కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సిబ్బంది స్వీయ జనగణనలో పాల్గొనేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 26 నుండి వచ్చే నెల 10 వరకు స్వీయ జనగణన జరుగుతుందని, 11వ తేదీ నుండి ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేటర్లు జనగణన నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న స్వీయ గణన నమోదులో ప్రముఖులను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో యాసంగి వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ధాన్యంలో తాలు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. హార్వెస్టర్లతో పాటు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా హార్వెస్టరులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు.

ఆర్పీఎం 18 నుండి 20 మధ్య ఉండేలా, బ్లోయర్ సరిగా పనిచేసేలా చూసుకోవాలని, అలాగే యంత్రం బి2 నుండి ఏ1 గేజ్ ఉండేలా అవగహన కల్పించాలని, దీంతో తాలు రాకుండా ఉంటుందని తద్వారా కొనుగోలు సులభతరం అవుతుందని వివరించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, సీపీఓ జవహర్, వ్యవసాయ అధికారి బాబూరావు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పరిశోధన పత్రాల పుస్తకాల ప్రమాణాలు పెరగాలి

ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :



పరిశోధన పత్రాలు, పుస్తకాల ప్రమాణాలు పెరగాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కే.ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థిని తన సిద్ధాంత గ్రంథాన్ని పబ్లిక్ పాలసీ అండ్ ట్రైబల్ వెల్ఫేర్ పుస్తకరూపంలో ప్రచురించినందుకు డాక్టర్ కే.చైతన్య కుమారి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ఆచార్య బి.సురేష్‌లాల్, ఆచార్య టి.మనోహర్, డాక్టర్ సంకేనేని వెంకట్, డాక్టర్ జి.కృష్ణయ్య, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# కేయులో కారుణ్య నియామకం

ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :



యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తూ 2024 జనవరిలో పరమపదించిన కె.మధుసూదన్ కుమారుడు కె.వి.ఆర్.ఎస్. తేజాను, క్లర్క్ కం టైపిస్ట్‌గా కారుణ్య నియామకం కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేయబడ్డాయి. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఈ నియామక ఉత్తర్వులను జారీచేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్, పర్యవేక్షకుడు కే.శ్రీనివాస్ పలువురు బోధనేతర సిబ్బంది కె.తేజకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆర్‌టీసీ కార్మికుల సమ్మెకు కేయూ విద్యార్థి జేఏసీ మద్దతు

ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెకు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ సంఘీభావం తెలుపుతున్నట్లు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చర్చలు జరిపి సమ్మెను విరమింప చేయాలని కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ డి.తిరుపతి అన్నారు. శుక్రవారం కేయూ లో జరిగిన జేఏసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చినహామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, కార్మిక సంఘం ఎన్నికలు, ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ హామీలను విస్మరిస్తుందని, అద్దె బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎలక్ట్రిసిటీ బస్సులు ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి నడువుతున్నదన్నారు. ప్రభుత్వమే నేరుగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి, వాటిని సంపూర్ణంగా ఆర్టీసీ సంస్థకే అప్పగించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల, ఆర్టీసీ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని, ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడద్దని పోరాటం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో విద్యార్థి జేఏసీ సీనియర్ నాయకుడు కలకోట్ల సుమన్, కన్వీనర్ కందికొండ తిరుపతి, కార్యదర్శి జనగాం రాజారాం, నాయకులు బొక్క ప్రవర్ధన్, రోనాల్డ్, అశోక్, నరేష్, కుమార్, అనిల్ పాల్గొన్నారు.



# అసమానతల విద్యా విధానం ప్రమాదకరం

- టిపిటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయండి
- టిపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ సెల్ సభ్యులు మునిగడప రామాచారి



భద్రాచలం టౌన్,ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అసమానతల విద్యా విధాన ప్రభావంతో సమాజంలో అంతరాలు ఏర్పడుతున్నాయని, ఈ విధానాలు దేశ సమగ్రాభివృద్ధికి ప్రమాదకరమని, ప్రజలందరికీ సమానమైన నాణ్యమైన ఉచిత విద్య అందించడం ప్రభుత్వాల బాధ్యత అని అందుకోసం జరిగే ఉద్యమాలలో మనం మన వంతు పాత్ర పోషించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) అకడమిక్ సెల్ సభ్యులు మునిగడప రామాచారి అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 30న హైదరాబాదులో జరిగే విద్యా సదస్సు గోడ పత్రికలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ... విద్యారంగ నిర్వహణను కేంద్రం తన చేతిలోకి తీసుకొని రాష్ట్రాల ప్రతిపత్తి ప్రజాస్వామిక రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇవ్వడం సరికాదని, విభిన్న భాషలు సంస్కృతులు సాంప్రదాయాలు భౌగోళిక భిన్నత్వాలు కలిగిన భారతదేశంలో ఒకే కరికులం ఒకే పరీక్ష ఒకటే విధానం అనడం కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యం అవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పదేళ్లకు పైబడి విద్యారంగం పూర్తిగా విధ్వంసానికి గురైందని, ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత పాలక పార్టీ సైతం గత ప్రభుత్వం యొక్క బాటలోనే విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తూ నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. విద్యా కమిషన్ సిఫారసుల ద్వారా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఒకవైపు ముఖ్యమంత్రి స్వీయ ఆలోచన అంటూ యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, స్కిల్ యూనివర్సిటీలు మరొకవైపు, ఉన్నత స్థాయి హైపవర్ విద్యా కమిటీ ఏర్పాటు అంటూ ఇంకొక వైపు విద్యారంగాన్ని గందరగోళ పరిస్థితులు ఉన్నాయని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లుగా కనపడటం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో ఉదయం 10 గంటల నుండి జరిగే రాష్ట్ర విద్యా సదస్సుకు ముఖ్యఅతిథిగా పాఠశాల విద్యా సంచాలకులు ఇ.నవీన్ నికోలస్ ఐఏఎస్, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఎం.కోదండరాం విద్యారంగ మేధావులు ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ చింతకింద కాశీం, ఆంధ్రజ్యోతి పూర్వ ఎడిటర్ కె.శ్రీనివాస్ తదితరులు హాజరై విద్యావిషయక అంశాలపై చర్చించనున్నారని, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యార్థులు, యువజనులు, సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి.ప్రకాష్ రావు, మండల కమిటీ సభ్యులు పి.రాంబాబు, రఘునందన్ సింగ్, జి.మోహన్, బి.వీరన్న, రాజేష్, జనార్ధన్, రమేష్, సురేష్, శ్రీను, జి.వీరన్న లు పాల్గొన్నారు.




# దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.58 వేలు విరాళం

భద్రాచలం,కల్చరల్ ప్రభాతవార్త:



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నిత్యన్నదాన పథకంకు ఏపీలోని విశాఖపట్నంకు చెందిన సుమశ్రీ హంసిత మత్స, వారి కుటుంబ సభ్యులు రూ.58,000 విరాళంగా అందజేశారు. ముందుగా వారు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యన్నదాన పథకంకు విరాళంను రామాలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబాకు అందజేశారు.

# పోషణ పక్వాడలో విశిష్ట ప్రతిభ

- బూర్గంపాడు సీడీపీఓ రేవతికి జిల్లా స్థాయి అవార్డు
- ఆన్‌లైన్ అప్‌డేట్స్‌లో మెరుగైన ప్రదర్శన
- జిల్లాలో ద్వితీయ స్థానం సాధన
- అంగన్వాడీ సేవలకు గుర్తింపు
- అదనపు కలెక్టర్ విద్యా చందన చేతుల మీదుగా పురస్కారం



బూర్గంపహాడ్, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే 15 రోజుల "పోషణ పక్వాడ" కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండలం అంగన్వాడీ విభాగం విశిష్ట ప్రతిభ కనబర్చింది. కార్యక్రమాల అమలు మాత్రమే కాకుండా, వాటి వివరాలను సమయానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో మెరుగైన పనితీరు ప్రదర్శించినందుకు బూర్గంపహాడ్ సీడీపీఓ రేవతి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా చేతుల మీదుగా రేవతికి అవార్డు ప్రదానం చేశారు. ఈ పురస్కారం బూర్గంపహాడ్ మండలంలోని అంగన్వాడీ సిబ్బంది సమిష్టి కృషికి దక్కిన గౌరవంగా అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేవతి మాట్లాడుతూ, "పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించిన పోషణ అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, గర్భిణీ స్త్రీలు మరియు చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన చైతన్య కార్యక్రమాలను సమయానికి డిజిటల్ వేదికల్లో నమోదు చేయడం వల్లే ఈ గుర్తింపు లభించింది. ఇది మా సిబ్బంది కృషికి వచ్చిన ఫలితం" అని తెలిపారు. అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ, "పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పోషణపై అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యమైన విషయం. ఈ దిశగా బూర్గంపహాడ్ మండలం చూపిన ప్రతిభ అభినందనీయం" అని అన్నారు. డబ్ల్యూఓ స్వర్ణలత లెనినా మాట్లాడుతూ, "అంగన్వాడీ వ్యవస్థను డిజిటల్ వైపు మళ్లించడం వల్ల సేవల పర్యవేక్షణ సులభతరం అవుతుందని అన్నారు. బూర్గంపహాడ్ టీమ్ చేసిన కృషి ఇతర మండలాలకు ఆదర్శంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఈ విజయానికి తోడ్పడిన అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, సిబ్బందికి రేవతి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరింత మంచి ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షి ంచారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంకు తరలిరండి

దుమ్ముగూడెం ప్రభాతవార్త: దుమ్ముగూడెం మండల కేంద్రంలో మే



ఒకటో తేదీన జరిగే బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలందరులు తరలిరావాలని ఆ పార్టీ డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానే రామకృష్ణలు పిలుపునిచ్చారు శుక్రవారం మండలంలోని మారాయి గూడెం పంచాయతీ పత్తిపాక గ్రామంలో అపక వీర్రాజు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల మే మొదటి తేదీన దుమ్ముగూడెం మండల కేంద్రంలో జరిగే పార్టీ భద్రాచలం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం జరుగు తున్నదని ఈ ఆత్మీయ సమ్మేళనంకు ముఖ్య అతిధులుగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పార్టీరాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పాల్గొననున్నారని ఈసమావేశంలో రాబోయే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల పై సమీక్ష సమావేశంజరుగుతుందని నియోజక వర్గం లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పై సమగ్ర సమీక్ష జరుగుతుందని అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశంలో నియోజక వర్గంలోని పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు పార్టీ మండల నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు సర్పంచులు వార్డు సభ్యులు పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు ఈకార్యక్రమంలో పార్టీ దుమ్ముగూడెం మండల కన్వీనర్ కణితి రాముడు సర్పంచులు అపకా అశ్వని శీలం కమల ఉపసర్పంచులు అపకా గోపాలరావు మడివి లక్ష్మి దేవి నాయకులు మడివి గంగరాజు శీలం చలపతి కల్లూరి కామేశ్వరరావు అపకా వెంకటేష్ రామారావు రామకృష్ణ కణితి రాజేష్,ల కారం వెంకటేష్ సాగి వర్మ రాజు మడకం సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# మూల ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడుదాం

- విద్యా ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి చెందాలి
- కులధృవీకరణ పత్రాల కోసం కృషిచేస్తాం
- మూల ఆదివాసీల సభలో ఎంఎల్ ఏ వెంకట్రావు
- ఆదివాసీల అండగా పోలీస్ శాఖ ఉంటుంది
- అభివృద్ధి కోసం కృషిచేస్తాం: సిఐ రాజువర్మ



చర్ల, ఏప్రిల్ 24,( ప్రభాతవార్త): మూల ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న ఆనాటి పరిస్థితులను భరించలేక తెలంగాణా రాష్ట్రంలో స్థిర నివాసం ఏర్పరుచుకొని ఇక్కడ జీవిస్తున్నారని వారు కూడా విద్యా ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించాలని మూల ఆదివాసీలు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కులధృవీకరణ పత్రాలు లేకపోవడం వలన అనేక రంగాల్లో అసమానతలకు గురౌతున్నారని వారికి అవసరమైన క్యాస్ట్ సర్టిఫికెట్స్ కోసం కృషిచేస్తామని అన్నారు. ఇప్పటికే ఈ విషయంపై మంత్రి సీతక్కతోపాటు మిగిలిన గిరిజన ఎంఎల్ ఏ లు అందరం కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఆదివాసీలు ఎక్కడ ఉన్న వారి సాంప్రదాయం కట్టుబాట్లలో ఎటువంటి వ్యత్యాసాలు ఉండవని అందరిది ఒకే వర్గం అని తారతమ్యాలు లేవన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి పోలీసు శాఖ వారు ఎంతో కృషిచేసారని గుర్తుచేసారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు. అనంతరం సిఐ రాజువర్మ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి పోలీస్ శాఖ ఎంతో కృషిచేసిందని విద్యా ఉపాధి క్రీడా రంగాల్లో వారికి తోడ్పాటును అందించామని అన్నారు. ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తామని అన్నారు. మొదట రాళ్లాపురం గ్రామంలో నిర్వహించిన సభకు హాజరైన ఎంఎల్ ఏ వెంకట్రావు సిఐ రాజువర్మ ఎస్.ఐ లు నర్సిరెడ్డి కేశవ్ కాంగ్రెస్ నాయకులకు ఆదివాసీలు వారి సాంప్రదాయ వాయిద్యాలు అయిన డోలు సన్నాయిలతో గ్రామపెద్దలు ఆదివాసీ యువతి యువకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మూల ఆదివాసీ 16 గ్రామాలకు చెందిన గ్రామస్తులు మూల ఆదివాసీ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీ కృష్ణ ముమ్మనేని అరవింద్ లంకరాజు విజయ్ కుమార్ నాయుడు గుండేపూడి సతీష్ రామగిరి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



సారపాక, ప్రభాతవార్త: సారపాకలోని మయూరి క్లబ్లో భద్రాద్రి మార్షల్ ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కరాటే లో ఎల్లో బెల్ట్ నుండి బ్రౌన్ బెల్ట్ వరకు ప్రతిభ చాటిన విద్యార్థులకు కరాటే సీనియర్ మాస్టర్ శేఖర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పోటీలలో భద్రాచలం పరిసర ప్రాంతాలలో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, నాగిన్ వర్ధన్, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# ఓటర్లు తమ ఓట్లను బూత్‌స్థాయి అధికారి వద్ద మ్యాపింగ్ చేయించుకోవాలి

భద్రాచలం, ప్రభాతవార్త: భారత ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ మ్యాపింగ్ సంబంధించిన ఓటర్లు తమ వివరాలను సంబంధిత బూత్ స్థాయి అధికారులకు తెలియజేసి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని భద్రాచలం తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఐటిసి పేపర్ బోర్డ్స్ వద్ద ఉధృతమైన ఐఎన్‌టీయుసీ మహా నిరసన

**- వేతన ఒప్పందం ముగిసి 24 రోజులైన సందర్భంగా 24 గంటల నిరసన కార్యక్రమం**

**- ఎండను సైతం లెక్క చేయక నిర్విరామంగా 24 గంటల పాటు ధర్నా**

**- పరిశ్రమ చరిత్రలో మొదటిసారి 24 గంటల పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు ధర్నా**



సారపాక, ప్రభాతవార్త: ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డ్స్ యూనిట్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకై ఐఎన్టీయుసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. 13వ వేతన ఒప్పందం ముగిసి 24 రోజులు గడుస్తున్నా, యాజమాన్యం నుండి సరైన స్పందన లేకపోవడంతో కార్మిక లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తుందిఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి ఐటీసీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు 24 గంటల పాటు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డులు ప్రదర్శిస్తూ భారీ నినాదాలతో నిరసన కార్యక్రమాన్ని ఐఎన్టీయుసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో చేపట్టారు ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఐఎన్టీయుసీ మిత్రపక్షాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోనే రామారావు. శ్యారం పిచ్చి రెడ్డి లు మాట్లాడుతూ.. కార్మికుల కష్టార్జితంతో లాభాలు గడిస్తున్న యాజమాన్యం, వారి కనీస అవసరాలను గుర్తించకపోవడం శోచనీయం. మా డిమాండ్లు నెరవేరే వరకు ఈ పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. ఈ ఏప్రిల్ నెల లో కొత్త వేతనంతో కూడిన జీతాలు ఇవ్వవలసి ఉండగా ఇప్పటివరకు యాజమాన్యం అటు గుర్తింపు సంఘం ఎటువంటిది స్పష్టత ఇవ్వకపోవడంతో కార్మిక లోకం అయోమయంలో ఉందన్నారు కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చడంలో యాజమాన్యం నిరక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మ్యాన్ పవర్ తగ్గించి పని భారాన్ని పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘానికి కూడా హెచ్చరిస్తున్నాం వేతన ఒప్పందంపై ఎన్నో ఆశలతో ఉన్న కార్మికులను ఇంకా మోసగించకండి. గతంలో అపోజిషన్లో ఉండి ప్యాకేజ్ సాధనకై గొంతెత్తి అరిసిన సందర్భాలను గుర్తు చేసుకోండి! అర్ధనగ్న ప్రదర్శనలతో ఒక్క మాన్ పవర్ కూడా తీయకూడదన్న కార్మికుల ఆవేదన అర్థం చేసుకోండి! నూతన కోటర్స్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయండి! రిటైర్డ్, వైద్యం, విద్య, బదిలీ కార్మికుల పర్మనెంట్, శ్రీరామనవమికి పేయిడ్ హాలిడే, జాబ్ క్యాలెండర్, డిపార్ట్మెంట్ గ్రేడ్లకై వేచి ఉన్న, తపిస్తున్న కార్మికులను దృష్టిలో పెట్టుకొని 22,000/ తగ్గకుండా వేతన ఒప్పందం పూర్తి చేయండి. అలాగే పరిశ్రమ 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతి కార్మికునికి పది గ్రాముల గోల్డ్ కాయిన్ బహుమతిగా ఇప్పించండి. మీకు ప్రతికూల పరిస్థితులు ఉంటే రండి కార్మికుల్లో కలవండి కార్మికులను న్యాయం చేసే భాగంలో మాతో కలవండి మీకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి మిత్రపక్షాల ఆఫీస్ బేరర్స్ నాయకులు కార్యకర్తలు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ ది ప్రభుత్వ హత్య

**- ఆర్టీసీ కార్మికుల సమస్యలను బేషరతుగా వెంటనే పరిష్కరించాలి**

**- మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు**

కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:



కార్మికుల సమ్మెకు మద్దతుగా తెలంగాణలో 60 లక్షల మంది గులాబీ శ్రేణులు ఆందోళనకు సిద్ధంగా ఉన్నారని, ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ ది ప్రభుత్వ హత్య అని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర్ రావు అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పరిష్కారం కోసం వనమా ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులతో కలిసి స్థానిక కొత్తగూడెం ఆర్టీసీ డిపో గేటు ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మాజీ మంత్రి వనమా తో పాటు రాష్ట్ర నాయకుడు వనమా రాఘవ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని లేనియెడల టిఆర్ఎస్ పార్టీ తరపున కొత్తగూడెం నియోజకవర్గంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి క,మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కిలారు నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీ మదేవి పల్లి, చుంచు పల్లి, సుజాతనగర్, పాల్వంచ మండల అధ్యక్షులు కొట్టు వెంకటేశ్వరరావు, లావుడ్య సత్యనారాయణ, ముత్యాల రాజేష్, మల్లెల శ్రీరామ్ మూర్తి, బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సంకు బాపన అనుదీప్, మాజీ ఎంపీపీ బదావత్ శాంతి, బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఉర్దూగర్ చైర్మన్ అన్వర్ పాషా, బిఆర్ఎస్ పాల్వంచ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, కార్పొరేటర్లు భూక్య రాంబాబు, సింధు తపస్వి, గుణచరణ్, మాజీ కౌన్సిలర్స్ రుక్మాంధర్ బండారి, వేముల ప్రసాద్, అంబుల వేణు, పల్లపు రాజు బిఆర్ఎస్ నాయకులు కనగల బాలకృష్ణ,మల్లెల రవిచంద్ర, ముత్యాల ప్రవీణ్, మిరియాల అలివేలు, ఆనంద్, శంకర్, పాల్వంచ పట్టణ మహిళా అధ్యక్షురాలు బట్టు మంజుల, హమీద్, నరేందర్, మోతి, పెయింటర్ రాజేష్, తమ్మిశెట్టి అశోక్, రమాకాంత్, నవతన్ సురేందర్, ఎండి గౌస్, ఖాజా, మునీర్, మనోజ్ కుమార్,షరీఫ్, పెద్ద మల్ల నరేందర్, చింతలపూడి జగన్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీకాంత్, ఇర్ఫాన్, బత్తుల శ్రీనివాస్, ఎస్డి హైమద్, బొందుగుల శ్రీధర్, కాపు జనిత్, పాష, ఖాజా, పిల్లి కుమార్, మేకల నాగబాబు, ఎస్ కె జానీ, కాశీ, దూదల బుచ్చయ్య, తాండ్ర శీను, మాదాసు పద్మ, డి కొండ సునీత, మట్ట అనూష, లచ్చిరాం, యాదయ్య, ఖదీర్, ఈ మంది గణేష్, గద్దం చిన్న వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళా నాయకురాలు, అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## వేసవి కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- మారుమూల గ్రామాల విద్యార్థులకు చక్కని అవకాశం**

**- డా.డిఎన్ కుమార్ సేవలు మరువలేనివి**

చర్ల,ఏప్రెల్ 24, ( ప్రభాతవార్త ):



ఏజన్సీ ప్రాంత విద్యార్థులకు నాన్యమైన విద్యను అందించేందుకు గత 20 సంవత్సరాల క్రితమే పాఠశాలను నిర్మించి మంచి విద్యాబుద్ధులు నేర్పి ఎందరికో విద్యా ఉపాధి అవకాశాలు అందించడంతో డా.డిఎన్ కుమార్ సేవలు మరువలేనివి అని అదే విధంగా ప్రతి ఏడాది ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించడం అభినందనీయం అని ఎంఎల్ ఏ డా, తెల్లం వెంకట్రావు అన్నారు.శుక్రవారం రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆనాడు ఎంతో ముందుచూపుతో ఇక్కడ పాఠశాల నిర్మించి ఎందరో విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించిన మహనీయుడు కుమార్ అని కొనియాడారు.ఉచిత కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు విధ్యార్థులకు చక్కని విద్యని నేర్పితే వారు ఎంతో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

**- ప్రజల చేత ప్రతిజ్ఞ.. చేయించిన సర్పంచ్ శ్యామల రవివర్మ**




**దుమ్ముగూడెం ప్రభాతవార్త:** దుమ్ముగూడెం మండల పరిధిలోని గౌరారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ శ్యామల రవివర్మ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించి చట్టాల గురించి అవగాహన కల్పించారు1992 లో 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ చట్టం ఏర్పడింది అని 1993లో అమల్లోకి వచ్చింది అని దివంగత మన్మోహన్ సింగ్ భారత ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో 2010 సంవత్సరం నుండి ప్రారంభం అయింది ఈ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం అని గుర్తు చేశారు భారత రాజ్యాంగంలో గిరిజనులకు గల ప్రత్యేక చట్టాలు 5 వ షెడ్యూల్ ఏరియాలోని పెసా,ఎఫ్ఆర్ఏ,యస్ సి/యస్ టి అట్రాసిటీ, భూ సంరక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు అనంతరం "మేము గ్రామ సభలను గౌరవిస్తూ గ్రామ అభివృద్ధికి పాటుపడతాం""బలమైన గ్రామం బలమైన దేశం అనే లక్ష్యంతో గ్రామ స్వరాజ్యం సాధనకు అంకితమవుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాము అంటూ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సున్నం రమేష్ సెక్రెటరీ స్రవంతి ఏఈవో అసీనా పాలకమండలి సభ్యులు గ్రామస్తులు మడివి నారాయణ ఉయిక రమేష్ సున్నం హరీష్ ఉయిక పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధర్నా ఘటనపై స్పందించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**- ధాన్యం శుభ్రపరిచి తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి**

కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైనదని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సుమారు 15 లారీల ధాన్యం రావడం జరిగిందన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఎర్రగుంట వద్ద జాతీయ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించిన ఘటనపై ఆయన స్పందించారు. పౌరసరఫరాల శాఖ అధికారుల పరిశీలనలో ధాన్యంలో తేమ శాతం (మాయిశ్చర్) అనుకూలంగా ఉన్నప్పటికీ, ధాన్యం పరిశుభ్రత లోపించడం గమనించినట్లు తెలిపారు. గుంపెనలు మరియు మలినాలు కలిసివుండటం వల్ల నాణ్యత ప్రమాణాలకు సరిపోకపోవడంతో కొనుగోలులో ఇబ్బందులు తలెత్తినట్లు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించగా కూడా ధాన్యం శుభ్రపరిచే ప్రక్రియ సరిగా జరగలేదని వెల్లడించినట్లు చెప్పారు. వెంటనే ప్యాడీ క్లీనర్లను వినియోగించి ధాన్యాన్ని శుభ్రపరిచిన తరువాత కొంతవరకు మెరుగైన ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ, కొంతమంది రైతులు శుభ్రపరచకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారి ధర్నాకు దారితీసిందన్నారు. ఈ విషయంపై తక్షణమే పౌరసరఫరాల శాఖ అధికారులు, సంబంధిత మేనేజర్లు రైతులతో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. రేపటి నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని



కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని పరిశుభ్రపరిచి మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఇప్పటికే మార్గదర్శకాలు అందించినట్లు వెల్లడించారు. రైతులు ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ తమ ధాన్యాన్ని పూర్తిగా శుభ్రపరిచి తీసుకురావాలని, కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

# మలేరియాపై ప్రజలు అవగాహనా కలిగి ఉండాలి...

**- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం**

**- డిఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్**



**కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో "జ్వరం అంటే మలేరియా కావచ్చు - రక్తపరీక్ష చేయించుకోండి" అనే నినాదం ప్రాచుర్యంలో ఉండేది. ప్రస్తుతం "అన్ని జ్వరాలు మలేరియా కావు" అనే అవగాహనతో పాటు, సరైన పరీక్షలు చేసి తగిన చికిత్స పొందడం అత్యవసరం. 2030 నాటికి మలేరియా నిర్మూలన లక్ష్యంగా ప్రతి సంవత్సరం కొత్త నినాదాలతో మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ... "మలేరియా నిర్మూలన దిశగా - ఇప్పుడు మనం చేయగలం, తప్పక చేయాలి" అని ఈ సంవత్సరం థీమ్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని, 2021: 35 కేసులు, 2022: 56 కేసులు, 2023: 90 కేసులు, 2024: 85 కేసులు, 2025: 87 కేసులు, 2026 (ఇప్పటివరకు): 21 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఇందులో అధిక శాతం కేసులు వలస వెళ్లి తిరిగి వచ్చిన వారి ద్వారా నమోదైనవని, ప్రతి సంవత్సరం దోమల నివారణ కోసం 5 దోమల మందు పిచికారి రెండు విడతలుగా నిర్వహించబడుతోంది. గత సంవత్సరం 160 మలేరియా ప్రభావిత ప్రాంతాలు గుర్తించి పిచికారి చేయబడింది. అలాగే పెద్దల వసతి గృహాలు (2008) లో ముందస్తు చర్యలుగా పిచికారి చేపట్టబడిందన్నారు. ప్రతి సంవత్సరం జూన్ నుండి డిసెంబర్ వరకు రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించబడుతుంది. అదేవిధంగా 119 ప్రమాదగ్రామాల్లో ప్రత్యేక దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండనివ్వకూడదని, నీటి పాత్రలకు మూతలు పెట్టాలని చెప్పారు. వారానికి ఒకసారి నిల్వ నీటిని ఖాళీ చేయండి (ఫ్రైడే - డ్రై డే" పాటించండి)ఓవర్ హెడ్ ట్యాంకులకు మూతలు పెట్టాలని, సెప్టిక్ ట్యాంక్ పైపులకు వలుచని జాలి కట్టాలని, వాటర్ కూలర్లు, డ్రములు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోండిదోమల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. దోమల వల్ల వచ్చే వ్యాధుల నుండి రక్షణ పొందేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరం అన్నారు.




# నైపుణ్యాభివృద్ధితో విస్తృత ఉపాధి అవకాశాలు యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి...

**- ప్రభుత్వ పథకాలతో స్వయం ఉపాధి సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమాలలో భాగంగా పాల్వంచలో శుక్రవారం నవ ఒకేషనల్ లో నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న శిక్షణ నాణ్యత, శిక్షణ కాలవ్యవధి, శిక్షణ అనంతర ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, ఆదాయ సాధన అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిక్షణార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, శిక్షణను మరింత ఫలప్రదంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా 2010లో స్థాపించబడిన "నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్" ద్వారా పరిసర ప్రాంతాల పేద యువతకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 2200 మందికి స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించగా, ప్రస్తుత సంవత్సరంలో 80 మందికి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలతో పాటు ప్రైవేటు సంస్థల్లో, అలాగే విదేశాల్లో కూడా ఉపాధి పొందడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు . కొంతమంది స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని స్థిరపరచుకోవడం ప్రోత్సాహకరమని అన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ,ప్రస్తుత కాలంలో వృత్తి విద్య కు ఉన్న ప్రాధాన్యతను యువత సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉంటేనే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. కేవలం డిగ్రీలు పొందడం సరిపోదని, ఉద్యోగ రంగం అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ స్కిల్స్‌ను అభ్యసించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలు, సర్వీస్ రంగాలు నైపుణ్యంతో కూడిన సిబ్బందిని కోరుకుంటున్నాయని, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫిట్టింగ్, సోలార్ టెక్నాలజీ, మెషిన్ ఆపరేషన్, డిజిటల్ సర్వీసులు వంటి రంగాల్లో శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు తక్కువ కాలంలో నేర్చుకునే వీలుతో పాటు త్వరగా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు, చేతివృత్తుల ద్వారా గత నెలలో సాధించిన ఆదాయానికి గుర్తింపుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఒ సంజీవరావు, తహసీల్దార్ ధారా ప్రసాద్, నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్ హెచ్ఆర్ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ఉపేందర్, ఏపీఎం వెంకయ్య, మహిళా సాధికారిక ప్రతినిధులు, నవ ఒకేషనల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పోషకాహార లోప రహిత జిల్లాగా నిర్మించుకుందాం...

**- ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి అసలైన సంపద**

**- జిల్లాలో ఘనంగా పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం**

**- జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచందన**



**కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** 2026 పూర్తి అయ్యే నాటికి మన జిల్లా పోషకాహార లోప రహిత జిల్లాగా నిర్మించుకోవాలనే లక్ష్యంగా పెట్టుకొని క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. శుక్రవారం నాడు స్థానిక సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ నందు గల మీటింగ్ హాల్లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జె.స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమము, అంగన్వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణీలకు శ్రీమంతాలు, జిల్లా స్థాయిలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయి సిడిపివోలకు, సూపర్వైజర్లకు, పోషణ అభియాన్ సిబ్బందికి, అంగనవాడి టీచర్లకు మేమేంటో,ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ విద్యచందన మాట్లాడుతూ... ఆరోగ్యవంతులైనా పౌరులే దేశానికి అసలైన సంపద అని మనం తీసుకునే ప్రతి ముద్ద మన ఆరోగ్యానికి పెట్టుబడి కావాలన్నారు. ఈ పోషణ పక్వాడా స్ఫూర్తిని ఈ 15 రోజులే కాకుండా, ఏడాది పొడవునా కొనసాగించే విధంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందించి అంగన్వాడీ కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని కోరారు. కేవలం ఆహారం తినడం వేరు, శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాలు అందేలా పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వేరు అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లెనినా మాట్లాడుతూ... పోషణ పక్వాడ 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 2061 అంగనవాడి కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులతో పాటు ప్రజలలో కూడా పౌష్టికాహార విలువల పై అవగాహన పెంపొందించామని తెలిపారు. ఒక బిడ్డ ఆరోగ్యం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే మొదలవుతుందని, గర్భిణీ స్త్రీలు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లతో పాటు, ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే ఇవ్వడం వల్ల ఆ బిడ్డకు జీవితాంతం అవసరమైన రోగనిరోధక శక్తి లభిస్తుంది అన్నారు, జిల్లాలో ఉన్న అన్ని అంగన్వాడి కేంద్రాలలో కాలానుగుణంగా సామూహిక వేడుకలైన అన్నప్రాసన, అక్షరాభ్యాసం, శ్రీమంతాలు నిర్వహించినట్లయితే పౌష్టికాహార విలువలపై ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదలపై మరింత అవగాహన కల్పించినట్లయితే ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యులవుతారని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో భాగంగా అంగనవాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యాభ్యసించిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడంతోపాటు, అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, శ్రీమంతాలు, పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మి, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీలత, వైద్య విద్య శాఖ అధికారులు సతీష్, డాక్టర్ రాకేష్, జిల్లాలోని సిడిపివోలు, సూపర్వైజర్లు, అంగనవాడి టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

# దుశర్లపై దాడిని ఖండించిన ప్రకృతి ప్రేమికులు



**కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** పర్యావరణవేత్త, జల సాధన సమితి జాతీయ అధ్యక్షులు, కృత్రిమ అడవి సృష్టికర్త, ప్రకృతి ప్రేమికుడు దుశర్ల సత్యనారాయణ పై దుండగులు దాడి చేయడాన్ని కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం సభ్యులు, ప్రకృతి ప్రేమికులు తీవ్రంగా ఖండించారు. నల్గొండ జిల్లాలో తన సొంత 70 ఎకరాల వ్యవసాయ భూమిని గత 40 ఏళ్లుగా కృత్రిమ అడవిగా తీర్చిదిద్ది, ప్రకృతికి ఎనలేని సేవ చేస్తున్న సత్యనారాయణ పై, గురువారం కొందరు దుండగులు అడవిలోకి చొరబడి చెట్లు నరకడం, మేకలను మేపడం చేస్తుండడంతో ఆయన మందలించడానే కారణంతో తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిని ప్రకృతి ప్రేమికులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం మొక్కల వెంకటయ్య ఇంటి వద్ద సమావేశమై, నిరసనను తెలియజేశారు. వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను నిమ్స్ లో చేర్పించి ప్రభుత్వం తరపున వైద్యం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ప్రకృతి ప్రేమికుల పైన ఇలాంటివి జరగకుండా, అటవీ ప్రకృతి పర్యావరణ చట్టాల ప్రకారం చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ దాడిని ఖండించిన వారిలో ప్రకృతి ఆశ్రమం గౌరవాధ్యక్షులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, పర్యావరణ వేత్త మొక్కల వెంకటయ్య, ప్రకృతి ఆశ్రమం కో ఆర్డినేటర్ జి సుగుణారావు, మన్ కి బాత్ మొక్కల రాజశేఖర్, రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ముస్తఫా, చిన్నారి ప్రకృతి ప్రేమికురాలు నైనిక రజ్యా, శంకర్, సాగర్, లక్ష్మి, దశరథ్ రజ్యా, శోభారాణి, యూన్సీ, రమేష్, భద్ర, అలెక్స్ లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత...

**కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేడబడుతుందని విద్యుత్ అధికారి హేమచంద్ర బాబు తెలిపారు. రైటర్ బస్తి గొల్లగూడెం, బస్ స్టాండ్, బెల్టపిట్, బర్మా క్యాంప్, విద్య నగర్, రాంనగర్, ఎన్కె నగర్, రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, గాంధీ కాలనీ, వికలాంగుల కాలనీ, ఎక్స్ సర్వీసెమెన్ కాలనీ, శేషగిరి నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ప్రధాన రహదారి ఆక్రమణలపై చర్యలకు యంత్రాంగం సిద్ధం

**- 27వ తేదీలోగా స్వచ్ఛందంగా తొలగించాలని మైక్ ప్రచారం**

**- గతంలోనూ ఆక్రమణదారులకు వెంగన్నపాలెం పంచాయతీ ద్వారా నోటీసులు**

**జూలూరుపాడు, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:** మండల కేంద్రంలోని తల్లాడ, కొత్తగూడెం ప్రధాన రాష్ట్రీయ రహదారి ఆక్రమణల తొలగింపు కోసం యంత్రాంగం చర్యలకు సిద్ధమైంది. గత ఏడాదికాలంగా ప్రధాన రహదారి పక్కన ఉన్న సైడ్ డ్రైన్ ను కొందరు ఆక్రమించడంతోపాటు రోడ్డుపైనే వ్యాపారాలు వెలిశాయి. మరికొందరు ఆక్రమణదారులు ఆక్రమించిన స్థలాల్లో పటిష్ట గదుల నిర్మాణాలు చేసి, అద్దెలకిస్తూ అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారు. దీని కారణంగా రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. రోడ్డు ఆక్రమణల కారణంగా వాహనాలు ప్రమాదానికి కూడా గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రధాన రహదారితో పాటు పాపకొల్లు క్రాస్ రోడ్, చంద్రుగొండ క్రాస్ రోడ్, జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన కూడళ్ళ వద్ద కూడా ఆక్రమణలు ప్రజల



రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారాయి. మండల కేంద్రం ప్రధాన రహదారి మొత్తం వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుంది. దీంతో ప్రజల అసౌకర్యాన్ని, ప్రమాదకర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గత ఏడాదికాలంగా వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ద్వారా ఆక్రమణదారులకు పలుసార్లు నోటీసులు కూడా ఇచ్చారు. నోటీసులు అందిన 48 గంటల్లోగా రోడ్డు ఆక్రమణలను తొలగించాలని, లేనియెడల శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా ఆక్రమణలు ఆగకపోగా ప్రధాన రహదారి ఆక్రమణల పర్వం మరింత కొనసాగడంతో తప్పని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీతో పాటు, (ఆర్అండ్ బి) రహదారులు మరియు భవనాలశాఖ ఆక్రమణల తొలగింపుకు శాఖాపరమైన చర్యల కోసం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే గత మూడు రోజుల క్రితం మండలం కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బి రోడ్డు సరిహద్దును గుర్తిస్తూ "రెడ్ మార్కింగ్" కూడా ఇచ్చారు. అనంతరం శుక్రవారం వెంగన్నపాలెం గ్రామ పంచాయతీలో మైక్ ప్రచారం కూడా నిర్వహించారు. 27వ తేదీలోగా ప్రధాన రహదారి వెంట సైడ్ డ్రైన్ వరకు ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా ఎవరికి వారే తొలగించాలని ఆదేశించారు. లేనియెడల ఆ తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రచారంలో వివరించారు.

# జాహ్నవి కుటుంబానికి కళాశాల సిబ్బంది ఆర్థిక సహాయం

**ములకలపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (బైపీసీ) చదువుతూ గత వారం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని మేకపోతుల జాహ్నవి కుటుంబానికి కళాశాల సిబ్బంది ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన జాహ్నవి అకాల మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు మానవత్వంతో కళాశాల బృందం బాసటగా నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కల్పన ఆధ్వర్యంలో అధ్యాపక సిబ్బంది స్వచ్ఛందంగా సేకరించిన రూ.15,000ను శుక్రవారం జాహ్నవి తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్



మాట్లాడుతూ ప్రతిభావంతురాలైన విద్యార్థినిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబానికి తమ వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మైలాగానీ చంద్రమోళి, రామకృష్ణ, సతీష్, వాణి, పుల్లయ్య పాల్గొనారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ రవిచంద్ర

**గాంధీచౌక్, ప్రభాతవార్త, ఏప్రిల్, 24:** తన సిఫార్సు మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. ఈ మేరకు ఖమ్మం బుర్హాన్ పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ. 8.50 లక్షల విలువైన చెక్కులను 19 మంది బాధితులకు అందజేశారు. మరో ఇద్దరికి ముందస్తు ఆపరేషన్ నిమిత్తం మంజూరైన రూ. 4 లక్షల విలువైన ఎల్ఓసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది, కోలుకున్న బాదితులను పరామర్శించి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల



కమల్ రాజు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మధిర మున్సిపల్ కౌన్సిలర్ వెన్నంశెట్టి అప్పారావు, మధిర పట్టణ బీఆర్ఎస్ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాసా రామారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిపోయిన గోపాలరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో పలువురికి ఎంపీ రవిచంద్ర పరామర్శ

**గాంధీచౌక్, ప్రభాతవార్త , ఏప్రిల్, 24:** ఇటీవల కాలంలో ఖమ్మం నగరంలో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం పరామర్శించారు. దంసలాపురం లోని అగ్రహారంలో నివాసం ఉండే ఆళ్ల వెంకటరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనయులు శేష వర్ధన్ రెడ్డి, అంజిరెడ్డి, అల్లుళ్ల బీరెడ్డి నాగచంద్రారెడ్డి, సత్య వర్ధన్ రెడ్డిలను ఓదార్చి, సానుభూతి తెలిపారు. అనంతరం శ్రీరామ్ హిల్స్ లో నివాసముండే కమర్తపు బతుకమ్మ కొద్ది రోజుల క్రితం చనిపోగా ఆమె తనయులు కమర్తపు మురళి, రవిందర్, కుటుంబ సభ్యులు కూరపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కూరపాటి ప్రదీప్ లను ఓదార్చి, సానుభూతి తెలిపారు. అనంతరం మధిరలో నివాసముండే తన



సమీప బంధువు ఆది వెంకటేశ్వర్లు (పెద్దబ్బాయ్) ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుమారులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమాల్లో ఎంపీ రవిచంద్ర వెంట మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్లు సాగర్, గుణ చరిత్, మహేష్ తదితరులు ఉన్నారు.

# చర్చి కాంపౌండ్ వంతెనపై ట్రాఫిక్ ఆంక్షలు: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్

**ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త:** నగరంలో గల చర్చి కంపౌండ్ వంతెన మరమ్మత్తుల నేపథ్యంలో వన్ వే లో రాకపోకలు కొనసాగుతాయని, కాబట్టి ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గమనిక: వెంకటగిరి క్రాస్ రోడ్ నుండి భారీ వాహనాలు, లారీలు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లు కోదాడ క్రాస్ రోడ్డు, బైపాస్ వైపు మళ్ళించడము జరుగుతుంది. వెంకటగిరి క్రాస్ రోడ్ నుండి చర్చి కాంపౌండ్ వంతెన వైపు వచ్చే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలుకొత్త పోలీస్ కమిషనర్ కార్యాలయం ప్రకాష్ నగర్ మీదుగా బోస్ బొమ్మ సెంటర్, గాంధీ చౌక్, పీఎస్ఆర్ రోడ్డు , నయాబజార్ వైపుమళ్ళించడము జరుగుతుంది. చర్చి కాంపౌండ్ నుండి ప్రకాష్ నగర్ వైపు ట్రాఫిక్ ను వన్ వే లో కొనసాగుతాయి. ముదిగొండ నుండి ఖమ్మం వచ్చే ప్రజలకు గమనిక వెంకటగిరి క్రాస్ రోడ్ దగ్గర గ్రీన్ ఫీల్డ్ హైవే మీదుధంసలపురం గ్రీన్ ఫీల్డ్ ఎగ్జిట్ దగ్గదిగి శ్రీ రామ్ హిల్స్, ముస్తఫా నగర్ మీదుగ ఖమ్మం రావాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.




# వాసవి కన్యకా పరమేశ్వరికి అధికారిక గుర్తింపుపై హర్షం

**- దోసపాటి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు**



దోసపాటి పిచ్చేశ్వర రావు

**అశ్వాపురం, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య సమాజానికి ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా అత్యంత ప్రాధాన్యమున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు జీవోజారీ చేయడం పట్ల దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, శివకామేశ్వరీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వర రావుహర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్య వైశ్యుల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనంద దాయకమని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సమాజంలోని అన్ని వర్గాలకు సంతోషాన్ని కలిగించేదిగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు సాంప్రదాయాలు, సంస్కృతికి మరింత ప్రాధాన్యతను చాటుతాయని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య అభినందనీయమని తెలిపారు.

# ఓటర్లు ఈ రోల్ మ్యాపింగ్‌లో సహకరించాలి.

**- చుంచుపల్లి తహసిల్దార్**

**చుంచుపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**



మండలంలో ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఈరోల్ మ్యాపింగ్ లో నమోదు చేసుకోవాలని చుంచుపల్లి తాసిల్దార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో "ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ) భారత్ ఎన్నికల సంఘం ద్వారా కార్యక్రమం అమలు జరుగుతోందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చుంచుపల్లి తహసీల్దార్ కూచిపూడి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) తమ పరిధిలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి "ఈరోల్ మ్యాపింగ్" ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే, ప్రతి కుటుంబానికి సంబంధించిన సభ్యుల వివరాలను కుటుంబ మ్యాపింగ్ కింద నమోదు చేయడం కూడా ఈ కార్యక్రమంలో ముఖ్య భాగమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, మండలంలోని ప్రజలందరూ తమకు సంబంధించిన బిఎల్ఓలను సంప్రదించి తమ ఓటరు వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కోరారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ద్వారా భవిష్యత్ ఎన్నికల కోసం ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం కావడానికి సహకారం అందిస్తారని తెలిపారు. చుంచుపల్లి మండల పరిధిలోని 18 పంచాయతీలలో ఉన్న 41 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డ్ సభ్యులు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రతి ఓటరు ఈ రోల్ మ్యాపింగ్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యేను పరామర్శించిన జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: ఇటీవల హైదరాబాదులో మోకాలు శస్త్ర చికిత్స జరిగిన సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ను ఆయన ఇంటి వద్ద జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ ,రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.మొగిలి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని పరామర్శించారు. వారికి జరిగిన శస్త్ర చికిత్స సంబంధించిన వివరాలను తెలుసుకొని తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో క్రీడారంగం అభివృద్ధి చెందే విధంగా ఎమ్మెల్యే కృషి చేశారని అన్ని రకాల క్రీడలకు కోట్ల రూపాయలతో శిక్షణ సామాగ్రిని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ద్వారా అందజేయించారని నేడు కొత్తగూడెం నియోజకవర్గంలో ఎంతో మంది ప్రతిభవంతులైన క్రీడాకారులుగా ఎదిగి పతకాలు సాధించే విధంగా ఆయన ఎంతగానో ప్రోత్సాహం అందించారని ఇంకా కొత్తగూడెం నియోజకవర్గం లో కావలసిన క్రీడ మైదానాల కోసం కృషి చేస్తున్నారు అన్నారు. అవి కూడా త్వరలో పూర్తి అయ్యి కొత్తగూడెం ఒక క్రీడ హబ్ గా తయారు కావాలని, ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతోటి సంతోషంగా ఉండి క్రీడాకారులు అందరికీ తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, తెలంగాణ రాష్ట్ర టైక్వాండో



అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇ.మొగిలి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను శాలువతో ఘనంగా సత్కరించారు.

## మాటలు కాదు శాశ్వత పరిష్కారం కావాలి

- ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు
- శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం బాధాకరం
- ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం స్పందించాలి
- ఏఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి రంగయ్యా



కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త: సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటం అత్యంత బాధాకరం అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం కొత్తగూడెం బస్టాండ్ ఎదుట రెండోవరోజు చేస్తున్న శాంతియుత ధర్నాలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని గత రెండు రోజులుగా డిపో ఎదుట నిలబడి శాంతియుతంగా పోరాటం చేస్తున్నారని,వీరి పోరాటానికి మద్దతుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె చేస్తున్నటువంటి ఆర్టీసీ కార్మికులు మనోవేదనకు గురై మనస్తాపం చెందుతున్నారన్నారు.కాబట్టి ప్రభుత్వం ఆలోచించి త్వరితగతిన వారి యొక్క న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. తెలంగాణలో గొప్ప పోరాటాలు చూసామని, తెలంగాణ సాయుధ పోరాటం ఒకటి పోరాటాలతో తెలంగాణ సాధించుకున్నదన్నారు. తిరిగి సమస్యలతో ఆత్మబలిదానాల కోసం కాదు అని పేర్కొన్నారు. కార్మిక సోదరులారా దయచేసి ఏ ఒక్కరు ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 12 ఏరియాలో ఆర్టీసీ కార్మికులకు నిలుస్తామని, ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.లేని పక్షంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్,సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి,నాయకులు కత్తెర్ల రాములు, గాంధీ, మండల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకుంటే పతనం తప్పదు

- ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం
- చట్టపరమైన సమ్మెపై నిర్బంధాలు ఆపండి
- ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర
- శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:



సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులను సాధించుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్ గేట్ నుంచి ఇన్ గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వ తప్పిదమే ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కార్మిక యూనియన్లంటే పాలకులకు ఎందుకు అంత




భయమని, హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పనిభద్రత, బకాయిలు, పనిభద్రత, కొత్తబస్సుల కొనుగోలు తదితర డిమాండ్లు ప్రభుత్వానికి సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తాము ఆర్టీసీ కార్మికులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి,, నాయకులు ఎర్రబెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, యూసుఫ్, సత్యనారాయణాచారి, షాహీన్, కైసర్, మేదిని లక్ష్మి, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

## అన్నదాతల ముంగిటకే చేరువైన ధాన్యం సేకరణ వ్యవస్థ...

- నియోజకవర్గానికి 22 ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరు
- ధాన్యం విక్రయాల్లో రైతులకు తప్పనున్న రవాణా ఇబ్బందులు
- వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందడుగు
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:



కొత్తగూడెం నియోజకవర్గానికి రికార్డు స్థాయిలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, ఇది నియోజకవర్గ రైతాంగానికి ఎంతో శుభపరిణామమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరుపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ..గత ప్రభుత్వాల హయాంలో మండలానికి కేవలం ఒకటి, రెండు కేంద్రాలు మాత్రమే ఉండేవని, కానీ తమ ప్రత్యేక కృషితో ఈసారి ఏకంగా 22 కేంద్రాలను మంజూరు చేయించడం జరిగిందని, సుజాతనగర్ మండలానికి 4 కేంద్రాలు, చుంచుపల్లి మండలానికి 4 కేంద్రాలు, లక్ష్మీదేవిపల్లి మండలానికి 5 కేంద్రాలు, పాల్వంచ మండలానికి 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని వివరించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, పంటను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా గ్రామాల సమీపంలోనే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తద్వారా రైతులకు రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధర నేరుగా వారి ఖాతాల్లోనే జమ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రాలు రావడం వల్ల ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం అవుతుందని, ఎక్కడా జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నియోజకవర్గ అభివృద్ధికి, రైతుల మేలుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు, సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

## జాతీయ బీచ్ వాలీబాల్‌లో తెలంగాణకు రజత పతకం

పాల్వంచ టౌన్ ,ఏప్రిల్ 24,ప్రభాతవార్త: గోవా రాష్ట్రంలోని మీరామర్ బీచ్ వద్ద నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ 17 సంవత్సరాల లోపు జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలలో తెలంగాణ రాష్ట్ర బాలుర జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది.ఈ పోటీలలో తెలంగాణ జట్టుకు చెందిన జి.విష్ణు వర్ధన్ (ఇంటర్ మొదటి సంవత్సరం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాల్వంచ), వై. రిషివర్మ (తొమ్మిదో తరగతి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ క్రీడా పాఠశాల, కిన్నెరసాని), బి. కార్తిక్ (పదో తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్‌ఆర్‌ఆర్ కాలనీ, గజ్వేల్, సిద్దిపేట జిల్లా) అద్భుత ప్రతిభ కనబరిచి జట్టును విజయపథంలో నడిపించారు.జట్టు కోచ్‌గా కొమరం వెంకటనారాయణ, సహాయ కోచ్‌గా కె. రామానందం, విభాగాధిపతిగా వై.రామారావు తమ సేవలు అందించారు.ఈ విజయంతో రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చిన క్రీడాకారులు, కోచ్‌లను పలువురు క్రీడాభిమానులు, అభినందించారు.






# ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందవద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది...

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్
- రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేస్తాం
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు
- టిఆర్ఎస్‌ది ఉత్తుత్తి ఆందోళన
- విలేకరుల సమావేశంలో పలువురు కాంగ్రెస్ నేతలు



**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:**

ఆర్‌టిసి కార్మికులు,ఉద్యోగులు సంయమనం పాటించాలని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, ఆత్మహత్యకు పాల్పడిన శంకర్ గౌడ్ కు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నానని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .గత బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వంలో 60 రోజులు పైబడి జరిగిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చామని, ఇప్పుడు కూడా ఆర్ టి సి కార్మికుల సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చైర్మన్ గా కమిటీ వేసి పరిష్కార మార్గాలు చేస్తుందని అన్నారు. అదే విధంగా రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పదవి చేపట్టిన నాటి నుండి సంస్థ ఆర్థిక స్థితి,స్థిరత్వం, విశ్వాసం, భారీ స్థాయిలో నియామకాలు,ఉద్యోగ భద్రత, కొత్త బస్సులు, సేవల విస్తరణ , ఆర్థిక బాధ్యత,బకాయిల చెల్లింపులు,వేతనాలు, ప్రయోజనాలతో ముందడుగు వేస్తూ ఉద్యోగుల సంక్షేమం,ఆరోగ్యం, భద్రత ,ఉద్యోగుల పునర్నియామకాలు చేయటం చరిత్రలో మొదటిసారి అని అన్నారు.ప్రజాపాలన గావిస్తున్న వైఖరి,సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై అవాకులు చెవాకులు పేలుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అవినీతి,కబ్జాలకు నీవే బ్రాండ్ అంబాసిడర్ వని, ఊసరవెల్లిలా పార్టీలు మారే చరిత్ర నీదేనని హేళన చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను విమర్శించే స్థాయి నీది కాదని, విజ్ఞత గల ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు రైతుల పక్షాన ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు..మీకు రైతుల పక్షాన మాట్లాడే అర్హత లేదన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో చరిత్రలో పండనంతా విధంగా గత సంవత్సరం, ఈ సంవత్సరం వరి, మొక్కజొన్న పండడం హర్షనీయమన్నారు.. రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.. దానికి తక్కట్టుగానే ప్రభుత్వం అన్ని విధాలుగా రైతు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. .రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు.. వీరు మొసలి కన్నీరు కారుస్తూ, సానుభూతిని తెలియజేయనవసరం లేదని హెచ్చరించారు..రైతులు అంత యార్డ్ లలో బస్తా లను కాటాలు వేసుకునే పనుల్లో ఉన్నారు..రైతులకు అవసరం ఉన్న చోట కొనుగోలు కేంద్రాలను తెరిచి,ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది అని పేర్కొన్నారు.. ప్రభుత్వానికి ఎంత కష్టమైన,నష్టమైనా భారించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు..ఇప్పటికే మూఫై కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు..ఇంకా అవసరమైతే ఏర్పాటు చేస్తామన్నారు..ఇప్పటికే 50వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్,జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, డిస పీసీసీ సభ్యులు జిల్లా ఓబీసీ సెల్ అద్యక్షులు పుచ్చకాయల వీరభద్రం,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య , నగర ఓ బి సి సెల్ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ , నగర కమిటీ సభ్యులు పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా అధికార ప్రతినిధి కల్యకుంట్ల గోపాల్, జిల్లా కార్యదర్శులు మూడుమూంతల గంగారాజు యాదవ్,చింతమల్ల రవి, ఫతే అహ్మద్, నగర కాంగ్రెస్ కమిటి అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాస్ , నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు సంపటం నరసింహారావు,కోనేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు..

# రైతాంగ సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ మహా ధర్నా

- ధర్నాలో పాల్గొన్న వద్దిరాజు రవిచంద్ర, పువ్వాడ అజయ్, తాతా మధు, కందాల ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య



**ప్రభాతవార్త వ్యవసాయం ఏప్రిల్ 24:**

ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న, వరి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని టిఆర్ఎస్ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజ రవిచంద్ర విమర్శించారు. వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పై ఏమాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టకుండా రైతులను తీవ్రంగా నిరక్ష్య వహించడం పట్ల రైతన్నలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని రైతాంగ సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ అధ్యక్షత వహించగా, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్రా వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి తదితరులు మహాధర్నాలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఎండలు మండిపోతుంటే మొక్కజొన్నలు తేమ శాతం ఉందంటూ కింటాకు 5 కిలోలు చొప్పున తరుగు తీయడం చాలా బాధాకరమని, ఈ దద్దమ్మ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కల్లాలో తో పాటు, రోడ్లు కూడా నిండి పోయాయని వద్దిరాజు విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందించారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. రేవంత్ రెడ్డి పాలనలో సాగు నీరు అందక, కరెంటు సరఫరా లేక, కరెంటు కోతల కారణంగా పంటలు ఎండిపోయాయని, యూరియా కోసం యాప్ పెట్టడంతో యూరియా కోసం రైతన్నలు తిరిగి, తిరిగి కాళ్లకు వాపులు వచ్చాయని విమర్శించారు. ఖమ్మం జిల్లా నుండి ముగ్గురు అతిరథ మహారధులైన మంత్రులు ఉన్నా కూడా రైతులు పండించిన ధాన్యాన్ని, మొక్కజొన్నని కొనుగోలు చేయటంలో విఫలం చెందారని వద్దిరాజు విమర్శించారు. మహా ధర్నా అనంతరం నాగలి పట్టుకొని ఫ్లాకార్డులు చేత పట్టుకొని మండు టెండలో కలెక్టరేట్లకు కెళ్లి నేలపై బైఠాయించి రైతన్నలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అంద చేశారు బి ఆర్ఎస్ శ్రేణులు, గులాబీ కండువాలు, టోపీలు ధరించి మహా ధర్నాకు పెద్ద సంఖ్యల తరలివచ్చి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగాల కమల్ రాజ్, కూరాకుల నాగభూషణ, గుండాల,(ఆర్‌జెసీ) కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్ కుమార్, ఉప్పల వెంకటరమణ, సేలం శెట్టి వీరభద్రం, తోటా రామారావు, తదితరులు పాల్గొన్నారు

# ఈపీఎఫ్ఓ నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ శ్రీనివాస్

ఖమ్మం ఏప్రిల్ 24, ప్రభాత వార్త:ఖమ్మం జిల్లాలోని సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, జిల్లా కార్యాలయం, ఖమ్మం వారు ఏప్రిల్ 27న (సోమవారం) ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ˇనిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని సత్తుపల్లి మునిసిపాలిటీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీ.ఎఫ్ కమీషనర్ వై.డి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించ బడతాయి అని అన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై మోదీ సాహసోపేత నిర్ణయం

- నియోజకవర్గాల విభజనతో దక్షిణాదికి నష్టం లేదు
- రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరి ఎప్పుడూ వ్యతిరేకమే
- మీడియా సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ఖమ్మం ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**



భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహిళా సాధికారతకు బాటలు వేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖినారీ శక్తి వందన్ అధినియంఖి (131వ రాజ్యాంగ సవరణ బిల్లు) ఒక సువర్ణ అధ్యాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొనియాడారు. గత 27 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ అంశానికి మోదీ శాశ్వత పరిష్కారం చూపారని, దీనిని కేవలం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక మార్పుగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఖమ్మంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గాల పునర్విభజన, జనగణన ప్రక్రియల ద్వారానే మహిళలకు దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా అమలు కాగలవని సోదాహరణంగా వివరించారు.మహిళా రిజర్వేషన్ బిల్లు లేదా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, గతంలో తొమ్మిది సార్లు ఈ బిల్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ చిత్తశుద్ధి లేకపోవడం వల్లే అవి చట్టం కాలేదని విమర్శించారు. ఈ బిల్లు అమలు అనేది జనగణన,నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలతో ముడిపడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న స్థానాలను తగ్గించకుండా, సీట్ల సంఖ్యను పెంచడం ద్వారానే పురుష సభ్యులకు అన్యాయం జరగకుండా మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించవచ్చని, ఇందుకోసం డీలిమిటేషన్ తప్పనిసరి అని విశ్లేషించారు. పార్లమెంటులో ఈ బిల్లును దాదాపు అందరూ మద్దతు తెలపగా, కేవలం ఇద్దరు సభ్యులు (అసదుద్దీన్ ఒవైసీ, ఇంతియాజ్ జలీల్) మాత్రమే వ్యతిరేకించారని గుర్తు చేశారు.నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షి ణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందన్న విమర్శలను కొండా విశ్వేశ్వర్ రెడ్డి గణాంకాలతో తిప్పికొట్టారు. గత చరిత్రను ఉదహరిస్తూ, కాంగ్రెస్ హయాంలో జరిగిన పునర్విభజనల సమయంలోనే దక్షి ణ భారత్ సీట్ల కేటాయింపులో తీవ్రంగా నష్టపోయిందని అన్నారు.ఓటర్ల పెరుగుదలను గమనిస్తే, నియోజకవర్గాల సంఖ్య పెరగడం అనివార్యమని ఎంపీ పేర్కొన్నారు. రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరించిన చారిత్రక ద్వంద్వ వైఖరిని ఆయన పత్రాల ద్వారా బట్టబయలు చేశారు. జవహర్ లాల్ నెహ్రూ గారు 1961 జూన్ 27న ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో, "నేను ఏ రకమైన రిజర్వేషన్లనైనా వ్యతిరేకిస్తాను... అవి అసమర్థతకు దారితీస్తాయి" అని పేర్కొన్నారని వెల్లడించారు. ఇలాంటి అక్రమాలను సరిదిద్దడానికి శాస్త్రీయమైన డీలిమిటేషన్ అవసరమని పేర్కొన్నారు. విపక్షాలు క్రెడిట్ అంతా మోదీ కి పోతుందన్న భయంతోనే ఖిధర్మ సంకటంఖి పేరిట నాటకాలు ఆడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు,రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వాకదానీ పుల్లారావు యాదవ్, రాష్ట్ర మహిళ నాయకులు దొడ్డా అరుణ అత్తి విజయ రెడ్డి, అనిత ,రజినీ రెడ్డి , స్వర్ణకుమారి, మందా సరస్వతి ,మనీ , ఫణి కుమారి ,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ

**- అంగన్‌వాడి టీచర్లకు సన్మానం**

**- ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ**



**అశ్వాపురం, ప్రభాతవార్త ఏప్రిల్ 24:**
గొందిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం లో ప్రజాపాలనలో భాగంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి ్మ అధ్యక్షత న గ్రామసభ నిర్వహించారు. అందులో భాగంగా పంచాయతీరాజ్ చట్టం యొక్క ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ లో విధులు నిర్వర్తిస్తున్న అంగన్వాడి టీచర్లను గౌరవంగా సన్మానించారు. అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ పోషకాహారం (న్యూట్రిషన్ ఫుడ్) యొక్క ఉపయోగాలను ప్రజలకు వివరించి, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సమావేశం కూడా నిర్వహించి గ్రామ అభివృద్ధికై పలు తీర్మానాలు చేశారు. గొందిగూడెం గ్రామపంచాయతీలో చిచ్చోడి నరసయ్య కుంట వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను సందర్శించి పనిలో పాల్గొంటున్న గ్రామ ప్రజల కోసం ఎండ తాపం నుంచి రక్షణ కల్పించేందుకు టెంట్ ఏర్పాటు చేసి, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు పారాసిటమాల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రావు, ఉపసర్పంచ్ గంగయ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురంలో ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



**అశ్వాపురం, ప్రభాతవార్త, ఏప్రిల్ 24;**
అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, స్థానిక సంస్థల బలోపేతం మరియు గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపిడిఓ జి. ముత్యాల రావు మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ వ్యవస్థ దేశ పురోగతికి వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పంచాయతీల పాత్ర కీలకమని ఆయన వివరించారు. సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మాట్లాడుతూ, అశ్వాపురం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీ తుళ్ళూరి ప్రకాష్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీ కందిమల్ల శ్రీకాంత్, వార్డు సభ్యులు వేములపల్లి హంసిత, కోర్సా ముత్తమ్మ, కుర్సాం అనసూర్య అంగన్వాడీ టీచర్లు, ఏ.ఎన్.ఎం లు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలి

**- ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు**

**- మణుగూరు మండలంలోని పలు పార్టీల నాయకులు**



**మణుగూరు, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:**
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలు జరిపి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మణుగూరు ఆర్టీసీ డిపో కార్యాలయం ముందు జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో భాగంగా ఆర్టీసీ సమ్మెకు సిపిఐ, టిడిపి, సీపీఐ (ఎంఎల్ )మాస్ లైన్ , బీసీ సంఘం, ప్రజా సంఘాలనాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడు తూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికుల డిమాండ్లు అమలు చేయాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థలో విలీనం చేస్తామన్న హామీ అమలు చేయాలని , ఆర్టీసీ కార్మికులకు పని భద్రత కల్పించాలని, ప్రభుత్వం కార్మికులకు ఇస్తా అన్న అగ్రిమెంట్లు వెంటనే ఇవ్వాలని, చనిపోయినటువంటి శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తొలుత ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, పట్టం నారాయణ దొర, రూపు రెడ్డి మధుసూదన్ రెడ్డి, దుగ్యాల సుధాకర్, సోమేశ్వర గౌడ్, రాంబాబు, కృష్ణ, ఆర్టీసీ మురళి, పూర్ణచంద్రరావు, గారు ,మద్దెల భద్రయ్య, తోట రమేష్, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, మంగి వీరయ్య, కన్నెబోయిన ప్రసాద్, ఆధర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## కొమరం లక్ష్మణరావుకు ఘన సన్మానం

**మణుగూరు, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:**
ఇటీవల గౌరవడాక్టరేట్ అందుకున్న మణుగూరు మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి కొమరం లక్ష ్మణ్ రావును శుక్రవారం మణుగూరు డివిజన్ ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం

**- కోనుగోలు కేంద్రం పరిశీలించిన తహసిల్దార్**



**పినపాక, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:**
మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ శ్రీనివాస రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, రైతులకు అందుతున్న సౌకర్యాలను అయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ ప్రతినిధులు, ఇంచార్జ్ సిబ్బందికి కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, తేమ శాతం, నాణ్యత ప్రమాణాల విషయంలో రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యంను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తామని తహసిల్దార్ తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, ఎటువంటి అన్యాయం జరగదని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డి టి శివకుమార్, తదితరు అధికారులు పాల్గొన్నారు.




## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

**- గ్రామ స్వరాజ్యానికి బలమైన పునాది**

**పంచాయతీరాజ్ వ్యవస్థ: ఎంపీడీవో సంకీర్త్**

**పినపాక, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:**



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామపంచాయతీలలో జాతీయ గ్రామ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంకీర్త్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. గ్రామస్థాయి సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశం ఈ వ్యవస్థ తోనే లభిస్తుందన్నారు. గ్రామ పంచాయతీలలో స్థానిక ప్రజలు తమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడానికి అవసరమయ్యే ప్రణాళికలు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సద్వినియోగం పై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడంతో సమస్యను పరిష్కరించుకుంటూ పంచాయతీ అభివృద్ధికి కారణం అవుతుందని అన్నారు. ఈ వ్యవస్థ ప్రజలకు మరింత దగ్గరగా ఉంటూ పాలన పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడమే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు పారదర్శకంగా తీసుకెళ్లడంలో సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజలు సైతం గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, పంచాయతీలను మరింత బలోపేతం చేయడానికి సహకరించాలని ఎంపీడీవో సంకీర్త్ పిలుపునిచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే రేగాను పరామర్శించిన గురిజాల గోపి

**మణుగూరు, ప్రభాతవార్త ఏప్రిల్ 24:** పినపాక మాజీ ఎమ్మెల్యే,



బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల రేగా కాంతారావు కొంత అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్ లో చికిత్స పొంది తన స్వగ్రామమైన కరకగూడెంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి రాజకీయాలకు అతీతంగా కరకగూడెం వెళ్లి రేగా కాంతారావును పలకరించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు రేగాతో ఆరోగ్య విషయాలను గురిజాల పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, బాడిష పార్వతి, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

## మండల మహాసభను జయప్రదం చేయండి

**– సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి**

**పినపాక, ప్రభాతవార్త, ఏప్రిల్ 24:** ఏప్రిల్ 26న జరిగే మండల 16వ మహాసభ వెంకట్రావుపేట గ్రామంలో జరగనుందని, మహాసభకు మండలంలోని అన్ని గ్రామాల సిపిఐ కార్యకర్తలు ప్రజాసంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయలని సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాలను అయన సందర్శించి మహాసభ విజయవంతం కొరకు ప్రచారం నిర్వహించారు. అదేవిదంగా మహాసభ ఏర్పాటును స్వయంగా పరిశీలించారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి: ఐఎఫ్‌టియు




**గుండాల, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

ఆర్టీసీ కార్మికులు గత మూడు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె ను ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సామాఖ్య (ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర నాయకులు డి .ప్రసాద్, జిల్లా నాయకులు యాసారపు వెంకన్న లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు అనంతరం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని పెండింగ్ లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని వారి జీవో లను వెంటనే గెజిట్ విడుదల చేసి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెను విస్తరింపచేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని అంతేకానీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని వారు అన్నారు... ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ కు ఐఎఫ్ టి యు గుండాల ఏరియా కమిటీ సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గడ్డం నాగేష్ వానపాకుల లాలయ్య చంద్యా తాటి కృష్ణ మెంతిన నగేష్ కిరణ్ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి..

- ఆర్టీసీ డ్రైవర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి..
- కార్మికుల సమ్మెకు ప్రగతిశీల యువజన సంఘం సంపూర్ణ మద్దతు..



**టేకులపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

టేకులపల్లి మండల కేంద్రంలో ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) జిల్లా కమిటీ సమావేశం కామ్రేడ్ తోటకూరి సతీష్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పర్సిక రవి జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ చింత నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ...ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వెంటనే చేసే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని చొరవ తీసుకొని కార్మికులతో చర్చలు సానుకూలంగా స్పందించి పరి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వేతన సవరణ చేసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతూ గత మూడు రోజుల నుండి ఆర్టీసీ కార్మికులు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రజాస్వామ్యకవేత్తంగా శాంతియుత పద్ధతిలో నిరసన చేస్తున్నారని ఈ నిరసన ప్రజలు సహకరించాలని కోరారు ఆర్టీసీ కార్మికులు తొందరపడి ఎవరు ఆత్మహత్యలకు పాల్పడవద్దని పోరాటాల ధోరణి సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రభుత్వాన్ని తెగించి ప్రతిఘటించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా కార్యదర్శి నోములవానిచందర్ జిల్లా నాయకులు అటికం శేఖర్ జోగకృష్ణ సాధన పల్లి రవి ముసలి సతీష్ కోడెం రవి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే కాళేశ్వరంపై అసత్య ప్రచారం...

- కోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- బిఆర్ఎస్ మండల కమిటీ నాయకులు



**టేకులపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

టేకులపల్లి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాలేశ్వరం పై కాంగ్రెస్ పార్టీ తీసిన అసత్య ప్రచారం కుట్రలను కోర్టు తీర్పు చెంపపెట్టు అని టేకులపల్లి విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ... కాలేశ్వరం పై కమిషన్ పేరుతో ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బ తీయాలని ప్రేమ ప్రభుత్వం చేస్తున్న సత్యప్రచారాలు కోర్టు తీర్పు చెంపపెట్టు అని బిఆర్ఎస్ జస్టిస్ పిసిగోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు శిరసా వహిస్తూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరీష్ రావులపై లేనిపోని ఆరోపణలను చేస్తూ రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ చేసిన కొట్టాలను కోర్టు తీర్పు హర్షనియమని ఇది బిఆర్ఎస్ విజయం కాదు అని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల విజయమని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య దల్ సింగ్ నాయక్, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, మాజీ ఎంపిటిసి జలాది అప్పారావు, భూక్య బాలకృష్ణ, అంగోత్ లకృతి, నామాల బిక్షం, సర్పంచులు, నాకా నాయక్, రామా నాయక్, మోలానా, కొండ బత్తుల శ్యామ్, ఉద్యమకారులు లాలు నాయక్, మహిళా మండల అధ్యక్షురాలు ఆమడ రేణుక, నాగభూషణం పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపిటిసి బాలకృష్ణ జన్మదిన వేడుకలు



**టేకులపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** టేకులపల్లి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీటీసీ బాలకృష్ణ జన్మదిన వేడుకను బిఆర్ఎస్ నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భూక్య దల్ సింగ్ నాయక్, సర్పంచ్ బోడ బాలు నాయక్, నాకా నాయక్, రామా నాయక్, లాలూ నాయక్, మాజీ ఎంపీటీసీ జలాధి అప్పారావు, మోలానా, కొండ బత్తుల శ్యామ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో కొత్త ప్రైవేట్ స్కూళ్లకు అనుమతిస్తే ఉద్యమం - ఏఐవైఎఫ్

**ఇల్లందు అర్బన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

ఇల్లందు పట్టణంలో నూతన ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్, పట్టణ అధ్యక్షుడు యాకేష్ స్థానిక ఎంఈఓ ఉమా శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని నంబర్2 బస్తీలో ఉన్న పాత శాంతినికేతన్ స్కూల్ ప్రాంగణంలో కొత్త ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇవ్వడం సరైంది కాదన్నారు. సమీపంలోనే మామిడి చెట్ల బడి, బర్లపెంట బడి వంటి ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలు ఉన్నప్పటికీ, అక్కడి ఇన్‌చార్జ్ నుంచే నో అబ్జెక్షన్ లెటర్ ఇవ్వడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై అధికారులకు చిత్తశుద్ధి ఉందా అనే సందేహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యారంగం బలపడాలని, విద్యార్థుల సంఖ్య పెరగాలని ఏఐవైఎఫ్ పలు కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సమయంలో, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇలాంటి అనుమతులకు సహకరించడం సమంజసం కాదని అన్నారు. కొత్త ప్రైవేట్ స్కూల్‌కు అనుమతి ఇస్తే సమీపంలోని రెండు యూపీఎస్ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, అనుమతి లేకుండానే కొత్త పాఠశాల నిర్వాహకులు తల్లిదండ్రులను ఆకర్షిస్తూ అడ్మిషన్ల కోసం ప్రచారం చేయడం గమనార్హమని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో), జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే బస్తీ ప్రజలు, ఇతర ప్రజాసంఘాలను కలుపుకుని పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.




ఇల్లెందు, గుండాల, టేకులపల్లి

# గ్రామాభివృద్ధికి పంచాయతీరాజ్ మార్గదర్శి

**ఇల్లందు అర్బన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయలక్ష్మి ్మ నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చట్టం ప్రాముఖ్యతపై చర్చించి, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ఇల్లందు అర్బన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన



సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, కొనసాగుతున్న సమ్మెను చర్చల ద్వారా విరమింప చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, ఎఫ్ టు జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా ఇల్లందు గోవింద్ సెంటర్ నుంచి బస్ డిపో వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ప్రయాణికులను ఉద్దేశించి మాట్లాడుతూ, గత మూడు రోజులుగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ పోరాటానికి ప్రజలు, ప్రయాణికులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆస్తులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు డ్రైవర్లు బస్సులు నడపడానికి ముందుకు రావద్దని, కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపొద్దని విజ్ఞప్తి చేశారు. ఇటీవల నర్సంపేటలో మరణించిన శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆతురతకు లోనై ఎలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదని, పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి. రాసుద్దిన్, రాష్ట్ర నాయకులు తోడేటి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కొప్పుల శ్రీనివాస్, నరాటి వెంకన్న, తొగర సామెల్, ఎల్. ధనంజయ్యా, న్యూడెమోక్రసీ నాయకులు ఎట్టి నరసింహారావు, ముసలి సతీష్, హర్జ్యా, బొగ్గారపు రాజు, గొగ్గల రామచందర్, గుర్రం యాదగిరి, మండల వీరయ్య, గణపారపు వెంకట నరసయ్య, వేంపెల్లి వెంకటేశ్వర్లు, బాలగాని శ్రీను, రమేష్, రవి, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



# పరిష్కారమయ్యే సమస్యలపై దృష్టి సారించాం

## గ్రామ సభలో సర్పంచ్ రమాదేవి

దమ్మపేట, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):

గ్రామ పంచాయతీ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని, మరికొన్నింటికి సమయం పడుతుందని సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్న ప్రజలను గ్రామ సమస్యలు ఉంటే తెలపాలి అనగా పలువురు సమస్యలు, గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సలహాలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ గుమ్మాస్తా గా





పనిచేసిన పందేటి చెన్నారావు కుమార్తె తన తండ్రి మరణానంతరం ఆ ఉద్యోగాన్ని తనకు ఇవ్వాల్సిందిగా కోరగా దానికి సర్పంచ్, కార్యదర్శి స్పందించి అప్లికేషన్ పెట్టుకోమని మే 14వ తేదీన జరిగే పంచాయతీ పాలకవర్గ సమావేశంలో చర్చించి తీర్మానంతో కూడిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉంటే తీసుకుంటామన్నారు. డ్రైన్ సమస్యను తలెత్తగా ఇప్పటికే డ్రైన్ల పై ఆక్రమణ చేసిన వారికి దుకాణదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో వొక్క మొక్కలు పెంచితే రాకపోకలకు పంచాయతీకి ఆదాయం వస్తుందని అనగా ఉన్నతాధికారుల సూచన మేరకు వర్షాకాలంలో వేస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వినతి పత్రాల రూపంలో సర్పంచ్, కార్యదర్శికి అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రవీందర్, జిపిఓ పాపయ్య, కార్యదర్శి బండి అనంత్‌కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ అనుసంధాన ప్రక్రియపై సమావేశం

అశ్వారావుపేట అర్బన్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ అనుసంధాన ప్రక్రియపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోవు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా తహశీల్దార్ అధ్యక్షతన బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, గ్రామ పాలన అధికారులకు ఎలక్టోరోల్ మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహశీల్దార్ హుస్సేన్, ఎన్నికల సీనియర్ సహాయకులు పి లక్ష్మయ్య, గిర్దావర్లు, జిపిఓలు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను పరిశీలించిన సర్పంచ్

తల్లాడ, ఏప్రిల్ 24, (ప్రభాతవార్త)

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామపంచాయితీలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ పరిశీలించారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మూడు నెలల వ్యవధిలో తన రాజకీయ గురువైన మాజీ ఎంపిపి దొడ్డా శ్రీనివాసరావు సహకారంతో పాటు ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావు సలహాలతో రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో ఆదర్శ గ్రామంలో తీర్చిదిద్దే విధంగా తన శక్తి మేరా కృషిచేస్తానని అన్నారు.



# శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు.. సర్కార్ చేసిన హత్యే!

రెండేన్నరేళ్లుగా తీరని అన్యాయం.. మనస్తాపంతోనే ఆర్టీసీ కార్మికుడి బలి

పార్థివదేహాన్ని డిపోకు తీసుకెళ్లనివ్వకపోవడం దుర్మార్గం

బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, ఉద్యోగం ఇవ్వాలి: మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట రూరల్ ఏప్రిల్ 24 (ప్రభాతవార్త) :

కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ప్రాణాలను బలితీసుకున్నాయని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. శంకర్ గౌడ్ ఆత్మబలిదానంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని విమర్శించారు.



అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేసి, కార్మికుల కష్టాలను తీరుస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ పార్టీ, రెండున్నరేళ్లుగా వారిని నిలువునా వంచిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న నమ్మకద్రోహం [illegible]న్ని, నిరంతర వేధింపులను తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆయన పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి తోటి కార్మికులు నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చాల్సింది పోయి, పోలీసులతో అణచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. తక్షణమే బాధితుడి కుటుంబానికి ఒక కోటి రూపాయల భారీ పరిహారం ప్రకటించ డంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును ఖిఅప్పాయింటెడ్ డేగా ప్రకటించి ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన స్పష్టం చేశారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఎఐయుకెఎస్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త):

మే 11, 12, 13 తేదీల్లో ఇల్లందులో జరగనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను సంఘ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని కోయరంగాపురంలో జరిగిన సమావేశంలో మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల పరిష్కారం కోసం, రైతుల హక్కుల రక్షణ కోసం ఈ మహాసభలు భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తాయని తెలిపారు. అఖిల భారత స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ సభలకు 16 రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరుకానున్నారు. మే 11వ తేదీన ఇల్లందు పట్టణంలోని ఫారెస్ట్ గ్రౌండ్ నుండి సింగరేణి గ్రౌండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, కంగాల వెంకటేష్ సోడెం ముత్యాలు, మొడియం బాబు, కుంజా బొజ్జి, మడకం నారాయణ, మడివి రామారావు, పూరేం చంద్రయ్య, అరుణోదయ నాయకులు కంగాల చిన్న తదితరులు పాల్గొన్నారు.



# చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

## ఎంపిడిఓ శ్రీధర్‌రాజు

తల్లాడ, ఏప్రిల్ 24, (ప్రభాతవార్త

చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎంపిడిఓ అంబటి శ్రీధర్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లారం గ్రామంలో దాసరి శ్రీనివాసరావు సతీమణి దాసరి శోభారాణి సేవా స్ఫూర్తితో ఆమె జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపిడిఓ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్, ఉప సర్పంచ్ అద్దంకి యశోద, మాజీ ఉప సర్పంచ్ ఎర్రి నరసింహారావు, మాజీ సర్పంచ్ మేడి సీతారాములు, సిపిఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, ఎస్టి సెల్ నాయకులు ధరావత్ అంజయ్య, కిసాన్ సెల్ నాయకులు ఎర్రి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిదేవర సీతారామయ్య, తోట మురళి, ధనకొండ ఉపేందర్, దాసరి నరసింహారావు, ధనికొండ నరసింహారావు, కటికి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.






రాష్ట్ర పండుగగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

## హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు

దమ్మపేట రూరల్ ఏప్రిల్ 24 (ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల దమ్మపేట మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు, అయ్యప్ప స్వామి దేవాలయ చైర్మన్ పసుమర్తి రామభద్రరావు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యు ల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

దమ్మపేట రూరల్ ఏప్రిల్ 24 (ప్రభాతవార్త :

ఇల్లెందులో మే 11, 2, 13 తేదీలలో జరిగే అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలను, 11వ తేదీ నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. మండలంలోని లింగాలపల్లి, జమీందారు బంజరు, గురవాయిగూడెం



,పార్కల గండి, చిల్ల గుంపు, కొత్తూరు, గొర్రెగుట్ట, జగ్గారం, పాకలగూడెం, గంగులపల్లి గ్రామాలలో జరిగిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని రక్షి ంచడానికి కృషి చేస్తున్న అఖిల భారత ఐక్యత సంఘం జాతీయ మహాసభలు 11, 12, 13, తేదీలలో జరుగుతున్నందున ఆ మహాసభలను విజయవంతం చేయాలని రైతాంగాన్ని కోరారు. ఈ మహాసభలకు రైతులు, వ్యాపారస్తులు, ఆర్థిక సహకారాలు అందించాలన్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగానికి మద్దతుగా అఖిలభారత సంఘం పోరాడుతుందని వ్యవసాయాన్ని కార్పొరేటర్లకు అప్పజెప్పలన్న బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టి వ్యవసాయం రక్షి ంచుకోవడం కోసం పోరాట కొనసాగిస్తున్నామన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం మద్దతు ధర, పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సాగుదారులందరికి పట్టా భూముల ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కురుసం ముత్యాలరావు, వాడే గిరిబాబు, చావ ముత్యాలరావు, కాకా వెంకటేష్, పెళ్లాం నగేష్, నాగరాజు పాల్గొన్నారు.

## వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

**మార్కెట్ లో పోసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన సీపీఐ మండల బృందం.**

**సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్.**

*ఏన్కూరు,ఏప్రిల్ 24, (ప్రభాత వార్త):*

రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి..సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కు మార్ డిమాండ్ చేశారు.మండల కేంద్రమైన ఏనుకూరులో వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో రైతులు ఆరబోసిన వరి ధాన్యాన్ని సీపీఐ మండల బృందం పరిశీలించి..రైతులతో



మాట్లాడారు.ఈ సందర్భంగా సీపీఐ మండల కార్య దర్శి జాగర్ల ముడి రంజిత్ కుమార్ మాట్లాడుతూ..ఇటీవల వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాలోతు రాందా స్ నాయక్..ఏన్కూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ అధికారులు ఇంత వరకు వరి ధా న్యాన్ని కొనుగోళ్లు చేయడం లేదని ఆయన అన్నారు.గత 15 రోజుల నుండి వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో వరి ధాన్యాన్ని రైతులు అరబోసి ఎదురుచూస్తున్నారని..కనీసం అధికారులు కూడా అటు వెపు కన్నెత్తి చూడడం లేదని ఆయన అన్నారు.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకు వస్తే ఇక్కడ కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని..వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చే యాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం మండల తహసీల్దార్ సిహెచ్ శేషగిరిరావు కి సీ.పీ.ఐ.బృందం ఆధ్వ ర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి మాదినేని వెంకన్న,మండల నాయ కులు బొగిన బోయిన నాగేశ్వరరావు,తాళ్లూరి రమణ,మాదినేని నర్సింహారావు,అరుణ్, పదిమల భిక్షపతి,తదిత రులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు జరగాలి

### ఎంపిడిఓ ఏ. శ్రీధర్ రాజు

*తల్లాడ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త*

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు జరగాలని ఎంపిడిఓ ఏ. శ్రీధర్



రాజు అన్నారు. శుక్రవారం మల్లవరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామపంచాయితీ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో పాటు ప్రజల భాగస్వామ్యంతో పాటు పనులు చేస్తే గ్రామం మరింత బలోపేతమవుతోందన్నారు. వేసవి కాలంలో కావడంతో గ్రామంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అద్దంకి యశోద, పంచాయితీ కార్యదర్శి షేక్ సిద్ధిఖీమియా, మేడి సీతారాములు, ఐనాల రామలింగేశ్వరరావు, ఎర్రి నరసింహారావు, కటికి వెంకటేశ్వర్లు, ఎర్రి కృష్ణారావు, దారావత్ అంజయ్య, తోట మురళి తదితరులు పాల్గొన్నారు.

**అన్నారుగూడెంలో...**

మండల పరిధిలోని అన్నారుగూడెంలో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నారుగూడెం గ్రామపంచాయితీ మూడు నెలల్లోనే ప్రగతి సాధించిందని, భవిష్యత్తులో కూడా గ్రామంలో మట్టి రోడ్లు లేకుండా సిసి రోడ్లతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

## బదిలీ అయినా బ్యాంకు అధికారికి సన్మానం

*వైరా టౌన్ ఏప్రిల్ 24 (ప్రభాతవార్త)*

స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం బ్రాంచ్ నందు. గత



నాలుగు సంవత్సరాలుగా క్యాషియర్ విధులు నిర్వహిస్తున్న శ్రీను నాయక్ అనే ఉద్యోగి హైదరాబాద్ హెడ్ ఆఫీస్ కు ట్రాన్స్ఫర్ అయ్యారు. గడచిన నాలుగు సంవత్సరాలలో తను ప్రజలకు బ్యాంకు ద్వారా అందించిన సేవలను గుర్తించి న్యాయవాది భరత రాజేష్ చిరు సన్మానం చేశారు.ఈ సందర్భంగా భరత రాజేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తాను ప్రజలకు అమితమైన సేవలు అందించాలని తన ఉద్యోగ నిర్వహణలో బాధ్యతగా ఉండాలని ప్రజలతో మమేకమైనప్పుడు బ్యాంకింగ్ చాలా సులువు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వేణు, సేవా కేంద్రం నిర్వాహకులు రమేష్, స్నేహ, వెంకటి, చారి మిగిలిన బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదం పొంచి ఉంది అని తెలుసుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

*వైరా టౌన్ ఏప్రిల్ 24 (ప్రభాతవార్త)*

వైరా మున్సిపాలిటీ పరిధిలో 6, 9 వార్డుల నందు గల ఇందిరమ్మ



కాలనీ వాసుల యొక్క చిన్న పిల్లలుకు ఎన్ఎస్పి కాలువ లో పడిపోయే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా గుర్తించి. కాలువకు ఆనుకొని ఫెన్సింగ్ ఏర్పాటు కొరకు ఎస్టిమేషన్స్ వేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్స్ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాపా మురళీకృష్ణ, మున్సిపల్ మున్సిపల్ ఏఈ శ్రీమాన్య, సానిటరీ ఇన్స్పెక్టర్ గుగులోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లో నర్సంపేట బి ఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

*కారేపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

నర్సంపేట మాజీ (బిఆర్ఎస్) ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని శుక్రవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని, ఖమ్మం జిల్లా కారేపల్లి పోలీస్ స్టేషన్కు తీసుకొచ్చారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశముందనే నెపంతో ఆయన అరెస్ట్ చేయగా అక్కడి ఏసీపీ రవీందర్ రెడ్డి స్వయంగా తన వాహనంలో నర్సంపేట నుండి నెక్కొండ, తొర్రూరు, ఖమ్మం మీదుగా కారేపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.







## సంక్షేమ వారోత్సవాలలో భావోద్వేగ భరితమైన వాతావరణం

**తల్లిదండ్రులకు పాదాభిషేకం చేసిన విద్యార్థులు**

**పిల్లల అభివృద్ధి పై ఆనందాన్ని వ్యక్తం చేసిన తల్లిదండ్రులు**

**వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత**

*కామేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :*

సంక్షేమ వారోత్సవాల సందర్భంగా కామేపల్లి మండలం ముచ్చర్ల లోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలోనిర్వహించిన కార్యక్రమం భా వోద్వేగభరితమైన వాతావరణంలో సాగింది.ఈ కార్యక్రమం సాధారణ సమావేశంగా కాకుండా, విద్యార్థులు-తల్లిదండ్రుల మ ధ్య అనుబంధాన్ని మరింత బలపరిచే విధంగా రూపొందించబడింది.తల్లిదండ్రుల సమావేశంలో ముందుగా విద్యార్థుల ప్రగతి, వసతి గృహంలో అందిస్తున్న సౌ క ర్యా లు , వా రి



విద్యాభ్యాసం గురించి సం క్షేమ అధికారి జంగం వేణు వివరించారు.తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పిల్లల అభివృద్ధిపై సంతోషం వ్యక్తం చేశారు.ఈ సమావే శానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది "పాదాభి షే కం" కార్యక్రమం.విద్యార్థులు తమ తల్లి దండ్రుల పాదాలను కడిగి వారికి గౌరవం తెలియజేయడం ఎంతో భావోద్వేగభరితంగా జరిగింది.ఈ దృశ్యం అక్కడున్న వారందరినీ కదిలించింది.తల్లిదండ్రులు కూడా ఆనందబాష్పాలతో తమ పిల్లలపై గౌరవం వ్యక్తం చేశారు.అదే విధంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఖమ్మం తరపున సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది.ఇది విద్యార్థుల్లో మరింత ఉత్సా హాన్ని నింపింది.సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు ఆనందంతో మెరిసిపోతూ తమ ప్రతిభను మరింత మెరుగుపరుచు కుంటామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సంస్కారం, పెద్దల పట్ల గౌరవం,పోటీ భావన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిందని తల్లి దండ్రులు అభిప్రాయపడ్డారు.ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తే పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగకర గా ఉంటాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి జంగం వేణు,వసతి గృహ సిబ్బంది,తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మొత్తం మీద ఈ సమావేశం విద్యార్థుల జీవితాల్లో ఒక మధురమైన అ నుభూతిగా నిలిచింది.

## పైపులైన్ పనులు ప్రారంభించిన సర్పంచ్

*కారేపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

సింగరేణి మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో గల గోవింద్ తండా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులను శుక్రవారం మాదారం గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ ప్రారంభించారు. గోవింద్ తండాలో మంచినీటి సమస్య పరిష్కారం కై లక్ష 30 వేల రూపాయల వ్యయంతో పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తండావాసులకు అందుబాటులో ఉండే విధంగా ఈ పైప్ లైన్ ఏర్పాటు చేస్తే దాదాపు నీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉండవన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో స్థానిక కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధం గా సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు .నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజ్మీర్ నరేష్ నాయక్ ఉప సర్పంచ్ లాలు మంగ వార్డు సభ్యులు బానోతు కోటి బి నగేష్ వీరన్న మల్టీ వర్కర్స్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



# అధిక ధరలు..ఆపై అక్రమ బెల్టు షాపులు...

తిరుమలాయపాలెంలో రెచ్చిపోతున్న సిండికేట్ మద్యం వ్యాపారులు...

నిబంధనలు పాటించని మద్యం వ్యాపారులు, మైనర్ బాలులకు మద్యం విక్రయం !మీటింగులలో ఉంటే చలవానిలో స్పందించను అంటున్న ఎక్సైజ్ సీఐ.!!!

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 24(ప్రభాత వార్త)

!!!తిరుమలాయపాలెం మండల వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో అధిక ధరలు, ఆపై అక్రమ బెల్టు షాపులు నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. మండలంలో ఉన్న మద్యం వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా అడుగడుగునా బెల్టు షాపులు, సందు సందుల్లో అక్రమ మద్యం దుకాణాలు సాక్షాత్కరిస్తూనే ఉన్నాయి. లైసెన్స్డ్ షాపులు కంటే అధిక ధరలకి మద్యం అమ్మకాలు ఆయా బెల్టు షాపుల్లో సాగుతున్నాయన్న ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. యథేచ్ఛగా మద్యం షాపుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 18 ఏళ్ల వయసు దాటని మైనర్ యువకులకు మద్యం అమ్మకూడదనే కనీస నిబంధనలు కూడా పాటించకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు...

**యం.ఆర్.పి విత్ ఆల్ టాక్సెస్..అన్న అన్న నిబంధనలు ఎక్కడ?**

ప్రతి బాటిల్ పై యం.ఆర్.పి విత్ ఆల్ టాక్సెస్ అని అన్ని పన్నులతో కలిపి అని ఒక రేటు ఉంటుంది. కానీ ఆ నిబంధనలు పాటించకుండా ప్రతి బాటిల్ పై ఎంఆర్పీ కంటే పది రూపాయలు అదనంగా అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి...

**అధికారుల మోనంపై విమర్శలు.**

నేతల అండదండలు, ఆమ్యామ్యాలకు అలవాటు పడి అధికారులు బెల్టు షాపులు నియంత్రించేందుకు ముందుకు వెళ్లడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని చోట్లా బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తూనే ఉన్నాయి. మద్యం షాపుల నుండే మద్యం ఆయా బెల్టు షాపులకి యథేచ్ఛగా రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మిన్నకుండిపోతుండటంతో అధికారులు, షాపు యజమానులు ఒక్కటై ఈ అక్రమానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాసులకు కక్కుర్తి పడి అధికారులు మోనం వహిస్తున్నారని ఆక్షేపణలు ప్రజల నుండి బలంగా వినిపిస్తున్నాయి. ..

**మండలంలో ఉన్న అన్ని షాపుల యజమానుల సిండికేట్.**

మండలంలోని అధికారికంగా ఐదు వైన్స్ షాపులు మాత్రమే కొనసాగాలి. కానీ ప్రతి షాపులో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి, ఒక కౌంటర్లో ఎమ్మార్పీ కి అంటున్నారు. బెల్ట్ షాపుల కొరకు ప్రత్యేకంగా మరొక కౌంటర్ ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ కి విక్రయించే కౌంటర్లు కస్టమర్లకు కావలసిన కంపెనీ మద్యను అమ్మకుండా, వారికి ఇష్టం వచ్చిన మద్యాన్నే విక్రయిస్తున్నారు. బెల్టు షపులకు మాత్రం అడిగిన మద్యాన్ని ఇస్తూ అదనపు సొమ్ముతో అక్రమంగా సంపాదిస్తున్నారు. దీంతో ఆయా షాపు యజమానులు తమకు అనుకున్నంత వ్యాపారం జరగడం కోసం బెల్టు షాపులకి మద్యం అమ్మకాలు చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అలాగే షాపుల నిర్వహణ భారం పెరిగిందని, నష్టాల్లో షాపులు నడుస్తున్నాయని, లాభాల కోసం ఎంఆర్పీ కంటే కొంత పెంచక తప్పదని షాపు యజమానులు పేర్కొంటూ అధిక ధరలకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు. మద్యం షాపు యజమానులు అంతా సిండికేట్ గా ఏర్పడి అన్ని షాపుల్లోనూ ఒకే మద్యం పాలసీ నడిపిస్తూ మద్యం ప్రియులను పిండేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని చోట్లా ఇదే విధానం, అవే అదనపు ధరలు, అనుమతులు లేని బెల్టు షాపుల నిర్వహణ నిత్యకృత్యమైందన్నది జగద్విదితం. అక్రమ బెల్టు షాపులు నిర్వహిస్తే సహించేది లేదు, అటువంటి వారిపై చర్యలు తప్పవు, లైసెన్స్ రద్దు చేస్తామనే అధికారుల ప్రకటనలు వట్టి బూటకమన్నది క్షేత్ర స్థాయిలో పరిస్థితి చూస్తే ఇట్టే ద్యోతకమవుతోంది. ఎంఆర్పీ ధరలకు మద్యం అమ్మకాలు జరపాలన్న నిబంధన తుంగలోకి తొక్కినా అధికారులు కిమ్మనకపోవడంలో ఆంతర్యమేమిటో అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎక్సైజ్ సీఐ వివరణ...**

మండలంలో మద్యం అదపు రేట్ల అమ్మకాలు, అక్రమ బెల్టు షాపుల విషయంపై ఎక్సైజ్ సీఐను గత రెండు రోజులుగా ప్రయత్నించా వారు నిన్న శుక్రవారం అందుబాటులోకి వచ్చారు. మండల పరిధిలోని ఉన్న వైన్ షాపులలో అధిక రేట్లతో మద్యం అమ్ముతున్నారని, అడిగిన మద్యం బాటులను ఇవ్వకుండా ఇష్టం వచ్చిన వాటిని ఇస్తున్నారని, ఒకవేళ అడిగింది కావాలంటే రెండవ కౌంటర్ నుండి అదనంగా 30 రూపాయలు ఇచ్చి తీసుకోవాలని అంటున్నారని, ఈ విషయాలపై వైన్ షాపుల వద్ద తీవ్రమైన గొడవలు జరుగుతున్నాయి, ఇట్టి విషయం, మీ దృష్టికి ఏమైనా వచ్చిందని అడగగా.. గొడవలపై లాండాడర్ వారు చూసుకుంటారని, మా పరిధిలో కేవలం కల్తీ మద్యం, ఇతర రాష్ట్రాల సరఫరా మధ్యం, కౌంటర్ పై రేట్ల విషయం ఇలాంటి విషయాలే చూసుకుంటామని అన్నారు. ప్రస్తుతం తిరుమలయపాలెం మండలంలో అలాంటి గొడవలు ఏం జరగలేదని, అంత సక్రమంగానే మద్యం నమ్మకం జరుగుతుందని తెలిపారు. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే మీరు అక్కడికి వెళ్లి మాకు ఫోన్ చేయండి అని అన్నారు. మరి రెండు రోజుల నుండి మీరు ఫోన్ చేస్తే స్పందించడం లేదుగా అని, కనీసం తిరిగి ఫోన్ కూడా చేయలేదు అని అడగగా.. నేను మీటింగ్ లో ఉన్నపుడు స్పందించనని తెలిపారు. మరి కనీసం రేపైనా అక్కడికి వెళ్లి ఫోన్ చేస్తే స్పందిస్తారని అని అడగగా.. ఏదైనా మీటింగ్ లో ఉంటే తప్ప ఖాళీ సమయంలో స్పందిస్తానని సమాధానం ఇచ్చారు.





## ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం..

కూసుమంచి, ఏప్రిల్ 24 (ప్రభాతవార్త) :

గ్రామీణ ప్రాంతాల పాలనకు ఉద్దేశించిన స్థానిక సంస్థలను పంచాయతీ రాజ్ వ్యవస్థగా పేర్కొంటారని కూసుమంచి సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అన్నారు. శుక్రవారం ఏప్రిల్ 24 సందర్భంగా కూసుమంచి గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ పల్లెలను శక్తివంతం చేయడంలో, సమ్మిళిత పాలనప్రోత్సహించడంలో కీలకం అన్నారు. గ్రామాలు ప్రగతి పథంలో నడిచినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. పల్లెల్లో క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన, పథకాల అమలు, రాజకీయ చైతన్యం, నిధులను సక్రమంగా సద్వినియోగం చేయడం లాంటి వాటికోసం ఏర్పాటు చేసిన వ్యవస్థే పంచాయతీ రాజ్ వ్యవస్థ అని వివరించారు. ఇందులో స్థానిక సమస్యలను స్థానికులే గుర్తించి క్షేత్రస్థాయిలో నిధులు సమీకరించి, ప్రణాళిక రూపొందించి అమలు చేసి పరిష్కరిస్తారు. పాలకుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు గ్రామాల్లో సుస్థిరాభివృద్ధిని నెలపొల్పేందుకు పంచాయతీ రాజ్ వ్యవస్థ దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖనుంచి పాల్గొన్న ఏఎన్ఎం ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా శుభ్రత ప్రధానమైనదని అన్నారు. పరిస రాలు పరిశుభ్రంగా ఉండి, ప్రజలంతా శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా క్రిష్ణవేణి, ఉపసర్పంచ్ చెన్ను వెంకటరమణ, పాలకమండలి సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, అర్వపల్లి ఉపేందర్, మంద నవ్య, అంతోటి వెంకన్న, గ్రామస్తులు, పాల్గొన్నారు.



## రైతుల పక్షాన మాట్లాడే అర్హత బిఆర్ఎస్ కు లేదు

**జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు వెల్లడి**

నేలకొండపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

రైతుల పక్షాన మాట్లాడే అర్హత బిఆర్ఎస్ నాయకులకు లేదని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు వెల్లడించారు. రైతుల పక్షాన బిఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. శుక్రవారం నేలకొండపల్లిలో విలేకరులతో బచ్చలకూరి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు పండనంతగా గత సంవత్సరం, ఈ సంవత్సరం వరి, మొక్కజొన్న అధికంగా పండటం హర్షనీయమన్నారు. దీంతో రైతులు సంతోషంగా ఉన్నారని ఆయన చెప్పారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కోనుగోలు చేస్తుందని చెప్పారు. బిఆర్ఎస్ నేతలు మోసలి కన్నీరు కారుస్తూ సానుభూతిని తెలియజేయనవసరం లేదని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి ఎంత కష్టమైన, నష్టమైనా భరించడానికి సిద్ధంగా ఉందన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి జిల్లాకు చెందిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సృష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఇప్పటికే 30 కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఇంకా అవసరమైతే మరికొన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఇప్పటికే 50వేల మెట్రిక్ టన్నులు కోనుగోలు కేంద్రాల ద్వారా కోనుగోలు చేశారని, ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.






## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు డిమాండ్**

నేలకొండపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు డిమాండ్ చేశారు. హైద్రాబాద్ లో మే 12 న జరగనున్న తెలంగాణ జన సమితి ప్లీనరీ భవిష్యత్ రాజకీయాలకు వేదిక కానున్నదని



ఆయన చెప్పారు. శుక్రవారం నేలకొండపల్లి నందు విలేకరుల సమావేశంలో గోపగాని శంకరరావు మాట్లాడుతూ టీజేఎస్ పార్టీ 4 వ ప్లీనరీ హైద్రాబాద్ నందు మే 12 వ తేదీన జరుగుతుందని చెప్పారు. ఈ ప్లీనరీని జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన చెప్పారు. ఉద్యమ ఆకాంక్షలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజాస్వామిక తెలం గాణను నిర్మించేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఆయన చెప్పారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాల ప్రాభల్యంను తగ్గించేందుకు అశాస్త్రీయమైన డీలిమిటేషన్ ను ముందుకు తీసుకొచ్చిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేసేందుకు కార్యచరణను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో టీజేఎస్ జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, మందడి వెంకటేశ్వరరావు, మండల నాయకులు తీగ రాములు, పి.ధనమూర్తి, మల్సూర్, ఆంజనేయులు, యాకయ్య, వెంకటేశ్వర్లు, కర్లపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు వెంటనే ఇవ్వాలి

**బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్**

నేలకొండపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

నేలకొండపల్లి మండల పరిధిలో పని చేస్తున్నటువంటి వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లును ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని బిఎస్పి పార్టీ నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. శుక్రవారం నేలకొండపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ కనకం నరసింహారావు యాదవ్ కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగాబొడ్డు బాబురావు మాట్లాడుతూ జీతభత్యం లేకపోయినా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా అహర్నిశలు కృషి చేస్తున్న విలేకరుల పాత్ర ఈ సమాజంలో ఎంతో గొప్పదని ఆయన అన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా విలేకరులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తాము అన్న మాట నీటి మూట లాగా మిగిలి పోయిందన్నారు. ఎంతో మంది జర్నలిస్టులు కుటుంబాలను పనంగా పెట్టి జర్నలిస్టు వృత్తిలో కొన సాగుతున్నారని, అటువంటి జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి ఏ రకమైన చేయూత లేక వారి పరిస్థితి దయనీయంగామారిందని, వారికి తక్షణమే ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆయన చెప్పారు.



# అన్నదాతకు అండగా బిఆర్ఎస్ పోరాటం





**ఖమ్మం కలెక్టరేట్ వద్ద బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతాంగానికి మద్దతుగా ధర్నా**

**అధిక సంఖ్యలో పాల్గొన్న రైతులు, పార్టీ కార్యకర్తలు**

**ధర్నా లో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్ది రాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాల, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్**

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త**

ఖమ్మం జిల్లాలో రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని అందుకు అవసరమైన కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి ఆ పార్టీ సానుభూతిపరులు రైతులు, కార్యకర్తలు,, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్ది రాజు రవిచంద్ర,, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.ముందు గా రైతు ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని,, వరికి మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వం దిగి వచ్చి ఖమ్మం జిల్లాలో పండిన అన్ని పంటలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు.వండి వార్చినా వడ్డించడం చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.. రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలి అని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అజయ్ పేర్కొన్నారు.. రేవంత్ రెడ్డి అసమర్ధ పాలన వల్లే రాష్ట్రంలో ఈ అరిష్టాలు జరుగుతున్నాయని అన్నారు.మనిషిని మనిషి ముట్టుకునే పరిస్థితి లేని కరోనా లో కూడా ప్రతి గింజ కొనుగోలు చేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వాన్నిదని పేర్కొన్నారు. పాపుల్లో లేని యూరియా యాపుల్లోలో ఎక్కడి నుంచి వస్తుందన్నారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి దాపురించిందన్నారు. యూరియా ఇవ్వడం చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు.అన్ని కష్టాలు భరించి పంట పండిస్తే కొనుగోలు కేంద్రాలు కూడా తెరవట్లేదన్నారు.పార్టీలు మారడం తప్పు తుమ్మలకు ఏం అనుభవం ఉందన్నారు. తెలంగాణలో స్వర్ణ యుగం రావాలంటే మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, కమిషన్లు, పర్సంటేజీలు, భూముల మీదనే మంత్రులకు ఇంట్రెస్ట్ ఉందని,.రైతు సమస్యల మీద మంత్రులకు ఇంట్రెస్ట్ లేదు అని దుయ్యబట్టారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను కొనలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. మార్కెపేడు ద్వారా కొనుగోలు చేయకపోవడం వలన ఒక్కొక్క రైతు కింటాకు ఎనిమిది వందల పైన నష్టపోతున్నాడని వద్దిరాజు విమర్శించారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై అన్ని వర్గాల ప్రజల తిరుగుబాటు మొదలైందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ఆరోపించారు రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ప్రభుత్వం వెంటనే మేల్కొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వరి మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజులు ధ్వజమెత్తారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూరాకుల నాఘభూషణం, ఆర్జెసి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, ఖమర్, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,మండల అధ్యక్షులు అజ్మీరా వీరు నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్తుపల్లి సి.హెచ్.పి నుండి బొగ్గు రవాణాకు తగు ఏర్పాట్లు

**రోజుకు 50 వేల టన్నుల వరకు బొగ్గు రవాణా జరపాలి**

**ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు నుండి బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలి**

**సమీక్షా సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం**




**కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

ఏడాదికి కోటి టన్నులకు పైగా బొగ్గు రవాణా జరుపుతున్న జేవీఆర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ లో సాంకేతిక సమస్యలను అధిగమించి ఈ ప్లాంటు నుండి పూర్తి స్థాయిలో బొగ్గు రవాణా జరిగే విధంగా చూడాలని, సగటున రోజుకు 45 నుండి 50 వేల టన్నుల బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. అలాగే ఒడిశా లోని నైనీ బ్లాక్ నుండి ఏడాది 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని, అలాగే బొగ్గు రవాణాలో తలెత్తిన అవరోధాలను అధిగమించాలని, స్థానిక ప్రభుత్వ అధికారులు, ప్రజల సహకారంతో లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన ఈ రెండు కీలక అంశాల పైన ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. సత్తుపల్లి ఏరియా నుంచి ప్రతీ రోజు సుమారు 50 వేల టన్నుల బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుందని, కోల్ బంకర్లలో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించుకొని ఏరియా నుంచి బొగ్గు రవాణాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆయన తెలిపారు. సత్తుపల్లి ఏరియాలో గల జేవీఆర్2 ఓపెన్ కాస్ట్ గని నుండి ఈ ఆర్థిక సంవత్సరం 11 మిలియన్ టన్నుల బొగ్గును, కిష్టారం ఓపెన్ కాస్ట్ గని నుండి 24 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని, సగటున రోజుకు సుమారు 45 నుండి 50 వేల టన్నుల బొగ్గు జేవీఆర్ సి.హెచ్.పి నుండి వినియోగదారులకు రవాణా జరపాల్సిన అవసరం ఉంటుందని, కనుక సి.హెచ్.పిని పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకురావడానికి తగు చర్యలను చేపట్టాలని ఛైర్మన్ ఆదేశించారు. ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సి.హెచ్.పి సంపూర్ణ వినియో గానికి చేపడుతున్న చర్యలను వివరించారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాకుకు ఈ ఏడాది 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించామని, బొగ్గు ఉత్పత్తితో పాటు బొగ్గు రవాణా కూడా సమర్థంగా జరపాలన్నారు. అక్కడ కోల్ కారిడార్ రోడ్డు నిర్మాణం పూర్తవదానికి కొంత సమయం పడుతుంది కాబట్టి ఈలోపు సమీపంలోని రైల్వే సైడింగులకు రోడ్డు మార్గం ద్వారా బొగ్గును రవాణా చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. నైనీ బొగ్గు బ్లాక్ నుండి సమీపంలోని రైల్వే సైడింగుల వరకు బొగ్గు రవాణా జరపడానికి తీసుకుంటున్న చర్యలను జనరల్ మేనేజర్ బైద్య వివరించారు. అలాగే ఈ గనిలో పనిచేయడానికి కావలసిన అధికారులు, కార్మికులు, సూపర్వైజర్ సిబ్బంది అవసరాన్ని కూడా ఆయన ఛైర్మన్ కు నివేదించారు. ఈ సమీక్ష కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్లానింగ్ !! ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్ మరియు కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.



# నైపుణ్యాభివృద్ధితో విస్తృత ఉపాధి అవకాశాలు యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**ప్రభుత్వ పథకాలతో స్వయం ఉపాధి సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమాలలో భాగంగా పాల్వంచలో శుక్రవారం నవ ఒకేషనల్లో నైపుణ్యాభివృద్ధి అవగా హన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మట్లాడి వారికి అందుతున్న శిక్షణ నాణ్యత, శిక్షణ కాలవ్యవధి, శిక్షణ అనంతర ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, ఆదాయ సాధన అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిక్షణార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, శిక్షణను మరింత ఫలప్రదంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా 2010లో స్థాపించబడిన "నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్" ద్వారా పరిసర ప్రాంతాల పేద యువతకు వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, సోలార్ టెక్నీషియన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇప్పటివరకు 2200 మందికి స్టైఫండ్తో కూడిన శిక్షణ అందించగా, ప్రస్తుత సంవత్సరంలో 80 మందికి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.శిక్షణ పొందిన అభ్యర్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలతో పాటు ప్రైవేటు సంస్థల్లో, అలాగే విదేశాల్లో కూడా ఉపాధి పొందడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు . కొంతమంది స్వయం ఉపాధి ద్వారా తమ జీవనోపాధిని స్థిరపరచుకోవడం ప్రోత్సాహకరమని అన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ,ప్రస్తుత కాలంలో వృత్తి విద్య కు ఉన్న ప్రాధాన్యతను యువత సరిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉంటేనే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. కేవలం డిగ్రీలు పొందడం సరిపోదని, ఉద్యోగ రంగం అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ స్కిల్స్ ను అభ్యసించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలు, సర్వీస్ రంగాలు నైపుణ్యంతో కూడిన సిబ్బందిని కోరుకుంటున్నాయని, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫిట్టింగ్, సోలార్ టెక్నాలజీ, మెషిన్ ఆపరేషన్, డిజిటల్ సర్వీసులు వంటి రంగాల్లో శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు తక్కువ కాలంలో నేర్చుకునే వీలుతో పాటు త్వరగా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు, చేతివృత్తుల ద్వారా గత నెలలో సాధించిన ఆదాయానికి గుర్తింపుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, తహసీల్దార్ ధారా ప్రసాద్, నవ భారత్ వొకేషనల్ ఇనిస్టిట్యూట్ హెచ్ఆర్ శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి , ఎస్సీ కార్పొరేషన్ అధికారి ఉపేందర్, ఏపీఎం వెంకయ్య, మహిళా సాధికారిక ప్రతినిధులు, నవ ఒకేషనల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా విస్తృతమైన చర్యలు

### కార్యాచరణ ప్రణాళిక కనుగుణంగా అభివృద్ధి పనులు

### మాదారం గ్రామ సర్పంచ్

*కారేపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

పంచాయతీలో నీటి ఎద్దడి తలెత్తకుండా విస్తృతమైన చర్యలు చేపట్టామని 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కనుగుణంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు మాదారం గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా మాదారం పంచాయతీ



కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ అధ్యక్షత ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవికాలంలో పంచాయతీ శివారు గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.99 రోజు కార్యాచరణ ప్రణాళికలో గుర్తించిన ప్రధాన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల మాదారం రామాలయం సమీపంలో పలు ఇళ్లకు నీటి సరఫరా లో అంతరాయం ఏర్పడిందని గుర్తించిన వెంటనే నూతనంగా పైపులైన్ ఏర్పాటుచేసి నీటి సరఫరా చేసినట్టు తెలిపారు. మాదారం గ్రామంలో జంగాల కాలనీ వడ్డెనేజీకి సంబంధించి పనులు చేపడుతామన్నారు. అదేవిధంగా విద్యుత్ సబ్స్టేషన్ సంబంధించి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంగన్వాడీ టీచర్లు పల్లె దవాఖాన సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్టంకై పాలక వర్గాలు పనిచేయాలి,

### మండల పంచాయతీ అధికారి

*కారేపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

సింగరేణి మండలం లో 41 గ్రామపంచాయితీ పాలక వర్గాలు ఆయా పంచాయితీల సమగ్రంగా అభివృద్ధి అయ్యేలా ప్రణాళిక బద్దంగా పనిచేస్తూ, ఆదర్శ పంచాయితీలుగా రూపుదిద్దుకునేలా కృషి చేయాలనీ మండల పంచాయితీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్ అన్నారు. జాతీయ పంచాయతీ



దినోత్సవ వేడుకల్లో భాగంగా భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యాలయం నందు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ మహాత్మా గాంధీ తెలిపిన విధంగా దేశ సమగ్రాభివృద్ధిలో పల్లె సీమలే పట్టుకొమ్మలని భావించి ఏర్పాటుచేసిన పంచాయతీరాజ్ వ్యవస్థ నేడు పటిష్టంగా మారిందని అన్నారు. పంచాయతీ ల అభివృద్ధి కొరకు ప్రభుత్వాలు కట్టుబడి నిధులు మంజూరు చేస్తున్నాయని వాటిని దుబారా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధికై లక్షలాది రూపాయల చేపట్టే అభివృద్ధి పనులు రాజకీయాల కతీతంగా పంచాయతీల అభివృద్ధికై పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమం లో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, పంచాయితీ కార్యదర్శి అనిల్ కుమార్, ఉప సర్పంచ్ భిక్కులాల్ వార్డ్ సభ్యులు గాంధీ, కిషన్, పెద్దలు రాందాస్ నాయక్, రాంచందర్ నాయక్, భీముడు నాయక్, మంగీలాల్ నాయక్, రాంజీ నాయక్, దేవులాల్ నాయక్ పంచాయితీ సిబ్బంది రాందాస్, నంద,గణేష్ రాదా, చరణ్, పాల్గొన్నారు

## అన్ని దానాల కంటే...నీటి దానం గొప్పది.

### బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం.

### శ్రీరామగిరి గ్రామపంచాయతీ సర్పంచ్ జారా సాంబయ్య.

*ఏన్కూరు,ఏప్రిల్ 24, ప్రభాత వార్త :*

అన్ని దానాల కంటే..నీటి దానం గొప్పదని.. ప్రజలు నీటిని పొదుపుగా వాడి..ఇతరుల దాహార్తిని తీర్చాలని శ్రీరామ గిరి గ్రామపంచాయతీ సర్పంచ్ జారా సాంబయ్య సూచించారు.మండల కేంద్రమైన ఏన్కూరులోని మండల ప్రజా ప రిషత్ కార్యాలయం ఎదురుగా..ప్రధాన జాతీయ రహదారి పక్కన బిఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ మాజీ శాస నసభ్యులు..కీర్తిశేషులు బానోతు మదన్ లాల్ జ్ఞాపకార్థం కోసం బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన చలివేంద్రాన్ని..జారా సాంబయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ



చేశారు.ఈ సందర్భంగా జారా సాంబయ్య మాట్లాడుతూ...ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నదని.. నిత్యం గ్రామాల నుంచి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పనుల కోసం ప్రజలు వస్తుంటారని..వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతల వ ల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చలివేంద్రం ద్వారా..చల్లని త్రాగునీరు దాహార్తిని తీరుస్తుందని ఆయన పేర్కొ న్నారు.రోజు రోజుకు ఎండలు తీవ్రత గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దాని దృష్టిలో ఉంచుకొని..గ్రామస్తులకు..బాటసారులకు..ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఆ యన తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ప్రజలకు అండ గా ఉంటామని ఆయన తెలిపారు.ఎండలు తీవ్రత రోజుకు..రోజుకు పెరగడంతో బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యం లో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని.. బాటసారులు.. గ్రామస్తులు అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు.మాజీ సర్పంచ్ గుగ్గులోతు ప్రసాద్,ఉప సర్పంచ్ బానోతు బద్రు,మల్లెంపాటి మాధవరా వు,అజ్మీర రైలు,ముదిగొండ నాగేశ్వరరావు,చీట్ కోటేశ్వర రావు,ఈశ్వర్ నాయక్,ఆలియా,కబీర్ దాస్,చిట్టి మోతుల నరసింహారావు ,గణేషుల బాబు,కొంటు సాంబయ్య,పుల్లయ్య,పదిమల నరసింహారావు కిషన్,నజీర్,మాదినేని సా యి,కొండపల్లి నరేష్,మేడా వెంకట్,వీరు నాయక్,చీట్ ముత్తయ్య,చల్ల రంగయ్య,ధారావత్ సురేష్,గౌడ నరసింహా రావు,భూక్య నరసింహ,భూక్య శివ,గోగినబోయిన వెంకటేశ్వర్లు,నజీర్,గడ్డం వెంకటేశ్వర్లు,భూక్య లక్ష్మ,మధు,నాగు లు మీరా,బుల్లయ్య,పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకై ధర్నా

*కారేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

మొక్కజొన్న కొనుగులు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర శాఖ బి ఆర్ ఎస్ పార్టీ పిలుపు మేరకు సింగరేణి మండల బి ఆర్ ఎస్ మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ముందు జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా తో పాటు సింగరేణి మండలంలమొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర ఆలస్యం జరుగుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, అధికారుల నిరక్ష్యం వల్ల రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆయన విమర్శించారు. కొనుగోలు కేంద్రాల సరైన ఏర్పాటు లేకపోవడం,



మద్దతు ధర అందకపోవడంతో రైతులు దళారుల చేతిలో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుట్ట నాగేశ్వర రావు, ప్రసాద్,ఉండేటి రామా రావు,కొప్పుల రామ కృష్ణ, బైరుమళ్ల రాజు, పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా పంచాయితీ రాజ్ దినోత్సవ వేడుకలు

### రాబోయే సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికలు ఆమోదం

*కారేపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవ వేడుకల్లో భాగంగా సింగరేణి మండల వ్యాప్తంగా 41 గ్రామపంచాయతీ శుక్రవారం ఎంపీ ఓ రవీంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రామసభలు పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్ ల అధ్యక్షతన నిర్వహించారు. ఈరోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా,రావోజీ తండా ప్రాథమిక పాఠశాలలో, సర్పంచ్



బాలు నాయక్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించి సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు . జిపిడిపీ యాక్షన్ ప్లాన్, 2026 2027 సంవత్సరానికి సంబంధించిన పనులు చేయడానికి, నిబంధనల ప్రకారం, తయారు చేసి గ్రామసభ ఆమోదం తీసుకోవడం జరిగింది. అదేవిధంగా మంగళ్ తండా గ్రామ సర్పంచ్ ధారావత్ మంగీలాల్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి హరి పర్యవేక్షణలో గ్రామ సభ నిర్వహించారు. ప్రధాన రహదారి మార్గంలో డ్రైనేజ్ ఏర్పాటు అంగన్వాడి కేంద్రం వద్ద మరం తోలకాలు చేయాలని గ్రామ సభ తీర్మానం ఆమోదించారు. అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ లో జరిగిన గ్రామ సభలోసర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నీటిని వృధా చేయవద్దు అని, ప్రతి పైపు కనెక్షన్ కి ట్యాప్ విధిగా పెట్టుకోవాలి అని, వేసవి కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మరియు గ్రామ పంచాయతీ పలు అభివృధి పనుల గురించి చర్చించటం జరిగింది.కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఏర్పాటు, గ్రామ పంచాయతీల ముఖ్య ఉద్దేశం, గ్రామ పంచాయతీలు దేశానికి పట్టు కొమ్మలు అని అన్నారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యం లో పేద విద్యార్థికి సైకిల్ వితరణ

*వైరా టౌన్ ఏప్రిల్ 24 (ప్రభాతవార్త)*

గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు జాలా పుల్లారావు ఆధ్వర్యం లో లయన్ ఉండ్రు శ్యామ్ బాబు వరలక్ష్మి ల కుమార్తె ఉండ్రు అక్షర సిరి పుట్టినరోజు సందర్భం గా వైరా కు చెందిన 20 వ వార్డ్ విద్యార్థిని షేక్ సన కి సైకిల్ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆదుకోవటం లో గ్రేట్ విజన్ క్లబ్ ముందు ఉంటుంది అని తెలిపారు.ఈ కార్యక్రమము లో మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకరరావు, జెడ్ సి చింతోజు నాగేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, ఉయ్యూరు రామకృష్ణ, జాలా మహలక్ష్మి, గోపి, నాగేశ్వరరావు,మెడికోస్ ఉండ్రు అజయ్ బాబు,రాశ్విక్ మరియు 20 వ వార్డ్ వాంకుడోత్ బిక్యా, ఉపేంద్ర, పృథ్వి ఖాజా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఐక్య రైతు సంఘం పోస్టర్ల ఆవిష్కరణ

*కారేపల్లి ఏప్రిల్ 24 ప్రభాతవార్త*

అఖిలభారత ఐక్య రైతు సంఘం బహిరంగ సభకు సంబంధించి గోడ పత్రికలనుసింగరేణి మండలం బాలు నాయక్ నివాసంలో నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగాఖమ్మం డివిజన్ కార్యదర్శి. గూగులోతు తేజ నాయక్. మాట్లాడుతూమే11.12.13. కొత్తగూడెం జిల్లాలో ఇల్లందు పట్టణంలో జరిగే జాతీయ అఖిలభారత ఐక్య రైతు సంఘం బహిరంగ సభ.ది.11న5గంలకు సింగరేణి గ్రౌండ్స్ బహిరంగ సభకు సింగరేణి మండలం నుండి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి. గుమ్మడి సందీప్ అఖిలభారత ఐక్య రైతు సంఘం మండలం అధ్యక్షులు వడ్డే వెంకటేశ్వరావు.రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని భాస్కర్. ఉపాధ్యక్షులు పుల్లకాన్ని సత్తిరెడ్డి. రైతు సంఘం నాయకుడు. బానోతు బాలు నాయక్. అఖిలభారత ఐక్య రైతు సంఘం సహాయ కార్యదర్శి శ్రీను. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ సభ్యులు రావుల నాగేశ్వరావు. తదితరులు పాల్గొన్నారు



# ఉపాధి హామీకి..కౌంట్ డౌన్.

**వచ్చేనెల ఒకటి నుంచి వీ.బీ.జీ.రామ్ జీ గా మార్పు.**
**ఈ నెలాఖరు వరకు పాత పనులు చేసుకునే అవకాశం.**
**కొత్త పథకంలో గ్రామపంచాయతీలకే పవర్స్.**
**125 రోజులకు పెరగనున్న పని దినాలు.**
**ఒండ్రు మట్టి తరలింపుకు..మే..వరకు అవకాశం ఇవ్వాలంటున్న రైతులు.**

*ఏన్కూరు,ఏప్రిల్ 24, ప్రభాతవార్త :*

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కౌంట్..టౌన్ మొదలైంది.మే ఒకటి నుంచి ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం వీ.బీ.జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ అండ్ అజీవికా మిషన్)గా మార్చనుంది.ఈ నేప థ్యంలో ఉపాధి హామీ పథకంలో పాత పనులు ఈ నెలాఖరు వరకే చేసుకోవాల్సి ఉంటుంది.కొత్త పథకంలో 266 ర కాల పనులను పొందుపరిచినా..అందుకు సంబంధించి పూర్తి మార్గదర్శకాలు మాత్రం విడుదల కాలేదు.ఇది వరకు వంద రోజులు పని దినాలు ఉండగా..125 రోజులకు పెంచారు.పనుల ఎంపిక అధికారాలు..గ్రామపంచాయతీలకే అప్పగించడం వంటి మార్పులు మేలు చేయనుండగా..భూమి చదును..ఒండ్రు మట్టి తరలింపు వంటి పనులను తొలగించడం సరికాదని రైతులు అంటున్నారు.ఉపాధి హామీ పథకం ఇక మారనుంది.మే..ఒకటో తేదీ నుంచి ఈ పథకానికి కేంద్రం వీ.బీ.జీ.రామ్ జీగా మార్చడంతో పాటు పనుల్లో కూడా మార్పులు చేర్పులు చేసింది.ఉపాధి హా మీ పథకం కింద ప్రస్తుతం ఒక కుటుంబానికి వంద రోజుల పని దినాలు మాత్రమే కల్పిస్తోంది.అదే వీ.బీ.జీ.రామ్ ప థకంలో మాత్రం ఒక జాబు కార్డుకు 125 రోజుల పని దినాలు కల్పించనుంది.ఇది కూలీలకు కలిసి వచ్చే అంశం. కూలి.రూ.307 ఇవ్వనున్నారు.ప్రస్తుతం చేసే చాలా పనులు..మే..నుంచి కనిపించవు.అందులో ఒండ్రుమట్టి తర లించే పనులను..రైతులు తమ పొలాల్లో చేసుకునే భూ అభివృద్ధి..(ల్యాండ్ లెవెలింగ్ )పనులు..కంప చెట్ల తొల గింపు..పనులను నిలిపివేశారు.అందుకే అధికారులు పాత పనులను ఈ నెలాఖరు లోగా చేయించాలని..సిబ్బంది వెంట పడుతున్న ఎండల కారణంగా పనులు చేసేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు.

గ్రామపంచాయతీలకే అధికారాలు..

ఉపాధి హామీ పథకంలో మండలానికి పనులు ఎంపిక చేసే అధికారాలు ఉండే వీ.బీ.జీ.రామ్ జీలో గ్రామపంచాయ తీలకు పనుల ఎంపిక..అధికారాలను కట్టబెట్టారు.ముఖ్యంగా నీటి నిల్వ పనులు..మౌలిక వసతుల కల్పన..శా శ్వత నిర్మాణాలు..ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.గ్రామాలలో కావలసిన మౌలిక వసతులు అంటే.. అంగన్ వాడి భవనాలు..పాఠశాలలో బాత్రూ రూముల నిర్మాణం..సీసీ రోడ్లు..డ్రైనేజీ వంటి పనులు గ్రామపంచా యతీ తీర్మానంతో చేసుకునే అధికారం ఇస్తున్నారు.అదే విధంగా నీటి నిలవ పనుల్లో చెక్ డ్యాములు..ఊట కుంట నిర్మాణము..వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది.ప్లాంటేషన్ కు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు.కచ్చితంగా గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలి.ఎస్టీ..ఎస్సీలకు సంబంధించి ఇప్పటివరకు వినియోగం లో లేని పొలాల భూఅభివృద్ధి పనులు మాత్రం..చేసుకునేందుకు కొత్త పథకంలో అవకాశం ఇస్తున్నారు.

ఒండ్రు మట్టి పనులు ప్రారంభం..

ఉపాధి హామీ పథకం కింద రైతులు తమ పొలాలలో ఒండ్రు మట్టి వేసుకునేందుకు పనులు ప్రారంభించారు.గ్రామా లలో ఉన్న చెరువుల నుంచి.. మట్టిని తోడి ట్రాక్టర్ల సహాయంతో రైతులు పొలాలకు తరలిస్తారు.సౌడు నేలలకు ఒం డ్రు మట్టి వేస్తే..పొలాలు సారవంతం అవుతాయి.ట్రాక్టర్లకు మట్టి వేసేందుకు లేబర్ కు కూలి ఉపాధి పథకం ద్వారా చెల్లిస్తుండగా..ట్రాక్టర్ల కిరాయి మాత్రం రైతులు భరించాల్సి ఉంటుంది.ఇప్పుడు ఇప్పుడే పలు గ్రామాలలో ఈ పను లు ప్రారంభం అయ్యాయి.నీళ్లు లేని చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నారు.లేబర్ కూడా ఒండ్రు మట్టి తీసే పని సులువుగా ఉండటంతో ఈ పనులు చేసేందుకు పెద్ద ఎత్తున వస్తారు.వచ్చే నెల అయితే చాలా చెరువుల్లో నీళ్లు ఖా ళీ అవుతాయి.అప్పుడు పెద్ద ఎత్తున మట్టి తరలింపు పనులు..జరిగే అవకాశం ఉంటుంది.ఈ నేపథ్యంలో రైతుల కూడా..మే..వరకు మట్టి తరలింపునకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న..అది సాధ్యం కాదని అధికారులు చెబుతు న్నారు.కొత్త పథకంలో ఈ పనులకు అవకాశం లేనందున ఈ నెలాఖరులో గానే చేసుకోవలసి ఉంటుంది.



## ఆర్టీసీ డిపోవద్ద తీవ్ర ఉద్రిక్తత

**- డిపోలోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులయత్నం**

**- పోలీసులు బీఆర్ఎస్ నాయకులమధ్య తోపులాట**

*జనగామ టౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :*

జనగామ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోవద్ద శుక్రవారం ఉదయం తీవ్రఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ సమస్యల పరిష్కారంకోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపేందుకు బీఆర్ఎస్ నాయకులు భారీసంఖ్యలో తరలిరావడంతో డిపో పరిసరాలు శుక్రవారం రణరంగంగా మారాయి. రాష్ట్రవ్యాప్త సమ్మెలోభాగంగా జనగామ డిపోఎదుట ఆర్టీసీ కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి డిపోలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిం చారు. అయితే, భద్రతా కారణాలదృష్ట్యా పోలీసులు వారిని అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది.పోలీసుల ఆంక్షలను ధిక్కరించి డిపోలోపలికి వెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో నిరసనకారులు, పోలీసుల మధ్య గంటకుపైగా వాగ్వాదం కొనసాగింది. భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ, నిరసనకారులు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. డిపోముందు బైఠాయించిన నిరసన కారులు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేయడం, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ అమలు చేయడం, ఇతర 32డిమాండ్లను సాధించేంత వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ నిరసనలో వివిధ రాజకీయపార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్మికులకు తమ మద్దతు ప్రకటించారు. ప్రస్తుతం డిపోవద్ద పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



## హుజురాబాద్ లో శంకర్ గౌడ్ మృతికి సంతాపం

**-- ఆర్టీసీ కార్మికుల ర్యాలీ**

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందడం పట్ల సంతాపంగా శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో ఆర్టీసీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. బస్ డిపో నుండి ఆర్టీసీ కార్మికులు మృతి చెందిన శంకర్ గౌడ్ చిత్రపటాన్ని పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడి శంకర్ గౌడ్



మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లనే శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందాడని అన్నారు. ఒక నిండు ప్రాణాన్ని ప్రభుత్వం బలికొందని అన్నారు. తాము ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని అడుగుతున్నామని అన్నారు. ఇప్పుడేమో ఆర్థిక భారం అని చెప్పడం ఎంత వరకు భావ్యమ న్నారు. వాగ్దానాలు చేసే సమయంలో ఈ విషయం వారికి తెలియదా అని అన్నారు. మృతి చెందిన శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం, రవాణా శాఖ మంత్రి కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం అన్నారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, నాయకులు గోశిక మధు, ఎస్. అచ్యుత్ కుమార్, ఇంజం చైతన్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఉస్మాన్ పాషా, జవర్ధన్, డిటిఎఫ్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, పలువురు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని అప్పుల ఊబి నుండి రక్షించాలి

**తెలంగాణ ప్రజా ఫ్రంట్ డిమాండ్**

*పెద్దపల్లి, ప్రభాతవార్త:*

ఆర్టీసీ విలీనం అంటే కేవలం జీతాల పెంపు మాత్రమే కాదని, కార్మికుల పూర్తిస్థాయి హక్కులు మరియు భద్రత కల్పించడమని తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ స్పష్టం చేసింది. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన ఆర్టీసీ విలీన చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కొత్త సర్వీస్ రూల్స్ విడుదల చేసి కార్మికులందరినీ పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా ఖాళీగా ఉన్న సుమారు 20 వేల పోస్టులను వెంటనే భర్తీ చేసి కార్మికులపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించాలని వారు కోరారు.

ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై స్పందిస్తూ.. మహాలక్ష్మి ్మ పథకం, విద్యార్థుల రాయితీలకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని హితవు పలికారు. సుమారు రూ. 3,500 కోట్ల పీఎఫ్ బకాయిలపై స్పష్టత ఇవ్వాలని, యాజమాన్యం వాడుకున్న రూ. 1,200 కోట్ల పీఎఫ్, సీసీఎస్ నిధులను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సంస్థపై ఉన్న రూ. 9,500 కోట్ల పాత అప్పులను ప్రభుత్వమే స్వీకరించి ఆర్టీసీని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అలాగే, ఇటీవల పని ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్న కార్మికుడు శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, వారికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు కె. రాజన్న, కాంపల్లి అంజయ్య, భూపాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.